

కావలి మున్సిపల్ కమిషనర్‌కు ఏసీబీ నోటీసు?

కావలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో అక్కడ భవన నిర్మాణంలో జరిగిన అక్రమాలపై ప్రస్తుతం కావలి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న శ్రావన్‌కుమార్‌కు ఏసీబీ అధికారులు నోటీసు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. 15 రోజులలో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆ నోటీసులు పేర్కొన్నారు. ఈ విషయమై కమిషనర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాను తిరుపతిలో ఉన్నానని తనకు ఎలాంటి నోటీసు అందలేదని చెప్పారు. అయితే జంగారెడ్డిగూడెంలో పని చేసేటప్పుడు ఒక భవన నిర్మాణంపై కేసు నడుస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

మా గౌరవం ఏదీ!?

- జడ్పీటీసీ సభ్యుల ఏకరువు
- 30 నెలలుగా వేతనాల పెండింగ్
- ఒక్కొక్కరికి రూ.1.8 లక్షల వరకు బకాయి
- ఉమ్మడి జిల్లాలో 48 మంది సభ్యుల ఎదురుచూపు



నెల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ సభ్యులు... మండలస్థాయిలో ప్రథమ పౌరులు. కానీ ఏం లాభం. ఇంటా..బయట వారికి దక్కుతున్న విలువ అంతంత మాత్రమే. మండల స్థాయిలో వారికున్న అధికారాలు, వారికి దొరుకుతున్న గౌరవ మర్యాదల గురించి పక్కన పెడదాం. గౌరవ వేతనం విషయంలోనూ జడ్పీటీసీలకు గౌరవం దక్కడం లేదు. దీనికోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూడాల్సి వస్తోంది. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో తమ గోడు వెల్లబోసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పోనీ.. అలా నోరుతెరిచి అడిగినా ఫలితం ఉంటుందా అంటే అదీనూలేదు. ఒకటి కాదు... రెండు కాదు 30 నెలలుగా గౌరవ వేతనం కోసం వారంతా నిరీక్షిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చట్టబద్ధంగా అందాల్సిన నిధులను పక్కదారి పట్టించి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయడమే కాదు.. ప్రజల చేత ఎన్నికకాబడిన జడ్పీటీసీ సభ్యులకు ఇవ్వాల్సిన గౌరవవేతనాన్ని రెండేళ్లపాటు ఇవ్వకుండా చేసింది. గత వైసీపీ పాలన పాపం కారణంగా ప్రస్తుత ప్రభుత్వం జడ్పీటీసీల గౌరవ వేతన బకాయిలను తీర్చడానికి తటపటాయిస్తోంది.

● వైసీపీ హయాంలో 18నెలలు..

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందనే నిందను మూటగట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవ వేతనం విషయంలోనూ తీవ్ర నిర్లక్ష్యం చేసింది. 2023, జనవరి నుంచి ఆ ప్రభుత్వం గద్దె దిగే వరకు అంటే సుమారు 18 నెలల కాలం గౌరవవేతనాలు చెల్లించలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రాధాన్యతా అంశాల ప్రాతిపదికన పాత బకాయిలు చెల్లిస్తూ వస్తోంది. ఆ క్రమంలో జడ్పీటీసీల గౌరవవేతనాల బకాయిలు 30 నెలల కాలానికి పెరిగింది.

● గౌరవవేతనం కోసం విన్నపాలు

శుక్రవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు సభాధ్యక్షులు, అమాత్యులు, జిల్లా సర్వోన్నతాధికారుల ముందు ఆత్మాభిమానం చంపుకొని వేతనం కోసం ఏకరువు పెట్టారు. 'హక్కులు, అధికారాల పరంగా మాకున్న గౌరవ మర్యాదలు అంతంత మాత్రమే అనుకున్నాం.. ఇప్పుడు వేతనం విషయంలోనూ గౌరవం లేకుండా పోయింది. 30 నెలలుగా మాకు వేతనాలు ఇవ్వడం లేదంటే దీనిని ఏమనుకోవాలి." అంటూ నిలదీశారు.

వాస్తవంగా ఒక్కో జడ్పీటీసీ సభ్యుడికి నెలకు రూ.6వేల గౌరవవేతనంగా చెల్లించాలి. మెజారిటీ సభ్యులకు ఈ ఆరు వేలు పెద్ద లెక్క కాదు. కానీ ఇది రాజ్యాంగపరంగా వారికి దక్కే గౌరవం. ఆ గౌరవం తగ్గిపోయిందని, నెలనెలా అందాల్సిన ఆ వేతనం 30 నెలలుగా ఆగిపోవడం దేనికి సంకేతమని జడ్పీటీసీలు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని 46మంది జడ్పీటీసీలు, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులు మొత్తం 48మంది ఉన్నారు. 30 నెలల వేతనం అంటే ఒక్కొక్కరికి 1.8 లక్షల రూపాయలు గౌరవం ఆగిపోయింది.

● జనరల్ ఫండ్స్ నుంచి సాధ్యమేనా!?

జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన విన్న రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తొలుత జడ్పీ జనరల్ ఫండ్ నుంచి బకాయి ఉన్న గౌరవవేతనాన్ని చెల్లించాలని అధికారులను సూచించారు. కలెక్టర్ ఆనంద్ సైతం ఆ సూచనను సమర్థించారు. ఆ విషయాన్ని పరిశీలించమని జడ్పీ సీఈఓను ఆదేశించారు. అయితే అలా చేయడం సాధ్యమయ్యే పని కాదని జడ్పీ అధికారులు అంటున్నారు. జడ్పీటీసీల గౌరవవేతనం సీఎఫ్ఎంఎస్ నుంచి నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అవుతుంది. అలాంటప్పుడు జనరల్ ఫండ్స్‌ను గౌరవ వేతనాల కోసం డ్రా చేసి ఇస్తే ఆ నిధులను తిరిగి రాబట్టుకోవడం సాధ్యం కాదంటున్నారు. పైగా జనరల్ ఫండ్స్ డ్రా చేయాలన్నా దానికి కూడా సీఎఫ్ఎంఎస్ అనుమతి ఇవ్వాల్సిందే. ఇందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జనరల్ ఫండ్స్ నుంచి గౌరవవేతనం డ్రా చేయడం అనేది సాధ్యం కాదని ఉద్యోగులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే గౌరవవేతనం విషయంలో స్పందిస్తే తప్ప మరో మార్గం లేదంటున్నారు. ప్రభుత్వం స్పందించే వరకు జడ్పీటీసీ సభ్యులు ఎదురుచూడక తప్పని పరిస్థితి.

పాలిటెక్నిక్‌లో ఉపాధి కోర్సులపై విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. ట్రిపుల్ ఈ, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సుల్లో సీట్లు అధికంగా భర్తీ అయ్యాయి. ఇప్పటికే తొలి విడత కౌన్సెలింగ్ పూర్తవగా, జిల్లాలోని తొమ్మిది కళాశాలల్లో 933 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన సీట్లను కూడా భర్తీ చేసేందుకు ప్రభుత్వం మరోసారి నోటిఫికేషన్ విడుదల చేయడంతో కౌన్సెలింగ్ కేంద్రాలు బిజీగా మారాయి.

ఉపాధి కోర్సులపైనే

ఆసక్తి

- ట్రిపుల్ ఈ, మెకానికల్, సిరామిక్‌కు ఆదరణ
- పాలిసెట్ తొలివిడతలో 933 సీట్ల భర్తీ
- రెండోవిడత భర్తీకి మరో అవకాశం



నెల్లూరు(విద్య), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెల్లూరు వెంకటేశ్వరపురం, దర్గామిట్ట పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు ఆత్మకూరు, కావలి, కందుకూరు పాలిటెక్నిక్ కళాశాలలు, గీతాంజలి, దామిశెట్టి బాలసురేష్, వెంకటేశ్వర, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలల్లో పాలిటెక్నిక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించి పలు కోర్సుల్లో సీట్లు కేటాయించారు. అన్ని కళాశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ట్రిపుల్‌ఈ, మెకానికల్, ఈసీఈ కోర్సులను విద్యార్థులు ఎంచుకోగా మిగిలిన కోర్సుల్లోనూ ఆశాజనకంగానే సీట్లు భర్తీ అయ్యాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో తాము ఎంచుకున్న సీట్లు దక్కని వారు ప్రైవేట్ కళాశాలల్లో చేరుతున్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు కోర్సుల ఎంపిక చేసుకుంటున్నారని, రెండో విడతలో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయని అధికారులు తెలిపారు.

● రెండోవిడత అడ్మిషన్లు ప్రారంభం

పాలిటెక్నిక్‌లోని పలు కోర్సుల్లో చేరేందుకు తాజాగా రెండో విడత ప్రక్రియను కూడా ప్రారంభించారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్ల నమోదు చేయాలి. ఈ ప్రక్రియను ఈ నెల 20వతేదీ వరకు నిర్వహించి 21న తుది వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం కల్పించారు. అనంతరం 23న సీట్లు కేటాయించిన అనంతరం విద్యార్థులు తామెంచుకున్న కళాశాలల్లో 24 నుంచి 26వ తేదీ వరకు రిపోర్టు చేయాలని అధికారులు తెలిపారు. సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించాలని కన్వీనర్ డాక్టర్ రామారావు తెలిపారు.

కోర్సులు	సీట్లు	భర్తీ
ఏఐ	66	17
ఏఐఎం	66	8
ఏయూటీ	66	60
సీసీపీ	99	70
సీఎంఈ	528	188
సీఈ	264	206
ఈసీఈ	422	38
ఈఈఈ	363	132
ఎంఈ	330	214

వైద్యుల రిజిస్ట్రేషన్

రెన్యూవల్ ప్రారంభం

- ప్రభుత్వ వైద్యకళాశాలకు తరలివచ్చిన డాక్టర్లు
- నేటితో ముగియనున్న ప్రక్రియ

నెల్లూరు (వైద్యం) జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్స్, రీ రిజిస్ట్రేషన్లు జరిగాయి. రెండు రోజులపాటు జరిగే ఈ రిజిస్ట్రేషన్‌కు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వైద్యులు తరలివచ్చారు. మొదటి రోజు 300 మంది వైద్యులకు రీ రిజిస్ట్రేషన్‌తోపాటు రెన్యువల్స్ చేశారు. నేషనల్ మెడికల్ కౌన్సెలింగ్ (ఎన్ఎంసీ) అధికారులు ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసి, రెన్యువల్స్ చేపట్టారు. ఈ సందర్భంగా మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు విజయవాడలో మాత్రమే వైద్యుల రీ రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ జరిగేవని, ఇప్పుడు జిల్లాల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లు పైబడిన వైద్యులందరూ రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ చేసుకోవాలని కోరారు. గతంలో రీ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.40-50వేలు ఉండగా దాన్ని 75 ఏళ్లలోపు ఉన్న వారికి రూ.8వేలు, పైబడిన వారికి రూ.6వేలుగా ప్రభుత్వం నిర్ణయించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, ఎన్ఎంసీ సభ్యులు డాక్టర్ అశోక్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాషా, డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యుల రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ చేస్తున్న అధికారులు



గాంధీబొమ్మ సెంటర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మున్సిపల్ కార్మికులను

ప్రభుత్వం ఆదుకోవాలి

- నిరసన ప్రదర్శనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు (వైద్యం) జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికులను ఆదుకోవాలని, వారి న్యాయమైన కోరికలను నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం నెల్లూరులోని వీఆర్‌సీ నుంచి గాంధీ బొమ్మ వరకు సీపీఎం శ్రేణులు నిర్వహించిన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండేళ్ల క్రితం ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తే అప్పటి ప్రభు త్వం 36 జీవోను తీసుకువచ్చి అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్డీఏ కూటమి కూడా తమ ప్రభుత్వం వస్తే అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థ అయిన అబ్కాస్‌ను కాదని ప్రైవేట్ కాంట్రాక్టర్‌లకు పారిశుధ్య కార్మికులను అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. ఇదే అమలయితే పెద్ద ఎత్తున అవినీతి జరిగే అవకాశం ఉంటుందని, 25 మంది కార్మికులు పనిచేస్తే 50 మంది పేర్లు రాసుకునే అవకాశం ఉంటుందన్నారు. మున్సిపల్ కార్మికుల కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల టెండర్లు రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ నిరసనలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, ప్రసాద్, మాలకొండయ్య, సూర్యనారాయణ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అందని

యునాని వైద్యం

- వైద్యులు, మందుల కొరత
- రోజురోజుకు తగ్గుతున్న రోగుల సంఖ్య

ఉదయగిరి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, ఆహారపు అలవాట్లతో రకరకాల వ్యాధులు ప్రజలను వెంటాడుతుండడంతో ప్రతినిత్యం అనేకమంది వైద్యశాలల వెంట పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. అలాంటి తరుణంలో ప్రస్తుతం వైద్యశాస్త్రంలో చోటు చేసుకుంటున్న మార్పుల దృష్ట్యా ఇటీవల ఆయుర్వేదం, యునాని, ఆక్యుపంక్చర్ వంటి చికిత్సలకు ప్రాధాన్యత పెరుగుతుంది. అందులో యునాని వైద్యం ప్రత్యేక స్థానం సంతరించుకుంది. అరబ్ దేశాల్లో తొలుత ప్రారంభమైన ఆ వైద్యం క్రమేణా దేశమంతటా విస్తరించడంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో 1983 నుంచి ప్రభుత్వాలు తమ ఆధీనంలో నిర్వహించేందుకు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా జిల్లాలోని ఉదయగిరి, నందవరం, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు, కసుమూరు ప్రాంతాల్లో వైద్యశాలలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలుత మెరుగైన ఫలితాలు సాధించినా క్రమేణా అధికారుల అలసత్వమో లేదా పాలకుల నిర్లక్ష్యమో తెలియదుగానీ ప్రస్తుతం వైద్యసేవలు అందని ద్రాక్షగా మారిపోయింది.



ఉదయగిరి : ప్రభుత్వ యునాని వైద్యశాలలో అరకొరగా ఉన్న మందులు

● వేధిస్తున్న వైద్యుల కొరత

ఏళ్ల తరబడి వైద్యుల కొరత వెంటాడుతుండటంతో యునాని వైద్యం పేరుకే అన్న చందంగా మారింది. ఉదయగిరి, నందవరం, ఆత్మకూరు వైద్యశాలల్లో ఇలాంటి పరిస్థితి దాపురించింది. నందవరంలో ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడంతో ఆ వైద్యశాల తలుపులు తెరిచే పరిస్థితి లేదు. పలుచోట్ల ఎప్పుడు తలుపులు తీస్తారో, ఎప్పుడు మూస్తారో తెలియదు. వైద్యులు, స్వీపర్ వంటి ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఏళ్ల తరబడి ఒకరిద్దరు సిబ్బం దితో మొక్కుబడి సేవలు అందుతు న్నాయి. దీంతో ఆ వైద్యశాలలకు వెళ్లే రోగుల సంఖ్య తగ్గిపోతోంది.

● మెట్టలో మరీంత అధ్వానం

ఇదంతా ఒకవంతైతే మెట్ట ప్రాంత మైన ఉదయగిరిలో పరిస్థితి మరీ అధ్వా నంగా మారింది. కూలీ, నాలీ చేసుకొని జీవించే అధిక శాతం మంది యునాని వైద్యం వైపు మొగ్గు చూపుతుండటం విశేషం. అయితే ప్రస్తుతం వైద్యం అందే పరిస్థితి లేకపోవడంతో చేసేదేమిలేక ఇతర వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఓ చిన్నపాటి ఇరుకైన గదిలో ఆ వైద్యశాలను నిర్వహిస్తుండటంతో ప్రజలకు సరైన ప్రచారం కూడా లేకుండా పోతుంది. వీటికితోడు 2004 నుంచి వైద్యాధికారి పోస్టు ఖాళీగానే ఉంది. ఇతర సిబ్బంది నియామకం కూడా చేపట్టకపోవడంతో ప్రస్తుతం కాంట్రాక్టు బేసిక్ కింద విధులు నిర్వర్తించే ఫార్మాసిస్టే దిక్కుగా మారింది. దీనికితోడు రెండేళ్లుగా మందుల సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో వైద్యం కోసం వెళ్లిన రోగులు మందులు లేవనే సమాధా నంతో అస హనం వ్యక్తం చేస్తూ వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి యునాని వైద్య సేవలను మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పగిలిన సిమెంటు రోడ్డు



ఇది ఒకప్పటి నెక్లెస్ రోడ్డేనా!?

సాయంసంధ్యవేళ నగరవాసులకు ఆహ్లాదం పంచేందుకు నిర్మించిన నెక్లెస్‌రోడ్డు ఇది. 2014-19 మధ్య టీడీపీ హయాంలో స్వర్ణాల చెరువు గట్టును ఎంతో అందంగా తీర్చిదిద్దారు. వాకింగ్ చేసేం దుకు ట్రాక్ ఏర్పాటుతోపాటు ఎంతోమంది మహనీయుల విగ్రహాలను కొలువు దీర్చారు. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ నెక్లెస్‌రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇంకేముంది.. ఒకప్పుడు ఎంతో అందంగా ఉన్న నెక్లెస్‌రోడ్డు ఇప్పుడు అందవిహీనంగా మారింది. సిమెంటు రోడ్డు పగిలిపోయి దర్శనమిస్తోంది. విగ్రహాల చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి నెక్లెస్‌రోడ్డుకు పూర్వ వైభవం తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)



నడిరోడ్డు ఇలా చీలింది!

అందవిహీనంగా ఉన్న వాకింగ్ ట్రాక్





విగ్రహాల చుట్టూ పిచ్చి మొక్కలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9445
వెండి కిలో ధర	రూ. 115800
వెండి ఒక గ్రాము	రూ.118.80

దివ్యాంగులకు ఉపకరణాల అందజేత

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న మదీనా వాచ్ కంపెనీ 60వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం దివ్యాంగులకు ఉపకరణాలను ఆ కంపెనీ అధినేత షేక్.ఇంతియాజ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 50 బ్యాటరీ ట్రైసైకిళ్లు, 30 వీల్‌చైర్లు, 25 ఇయర్ మిషన్లు, 20టాయిలెట్ సీట్లు, 25 నెక్ బ్యాండ్‌లు పంపిణీ చేశారు. వీటిని కృత్రిమ అవయవాల పునరావాస కేంద్రం, ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఇండియా సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్.షోయబ్, షేక్.ఉస్మాన్‌నమి, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మకు శాంతి పూజలు



కొలువుదీరిన అంకమ్మ

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టెక్కేమిట్టలో వెలిసి ఉన్న అంకమ్మకు శనివారం రాత్రి శాంతిపూజలు నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఈ పూజలు జరిగాయి. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ కార్యక్రమాలను పర్యవేక్షించింది.

ప్రజలే పోషకులు కావాలి

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సాహిత్యం, కళలు, కవులు, కళాకారులు పూర్వవైభవం సాధించాలంటే ప్రజలే పోషకులు కావాలని ఆచార్య పాయసం సుబ్రహ్మణ్య మహర్షి తెలిపారు. శనివారం రాత్రి నెల్లూరు వర్ధమాన సమాజం భవనంలో చేతన్ సంగీత, సాహిత్యవేదిక నిర్వహించిన సాహిత్య చారిత్రక విశ్లేషణలో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. నేడు ప్రజాస్వామ్యంలో రాజులు లేరని, ప్రజలే రాజులని తెలిపారు. అనంతరం ఆయన్ను ముఖ్యఅతిథులు నలబోలు బలరామయ్యనాయుడు, చేతన్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వై.శేషగిరిరావు ఘనంగా సత్కరించారు.

ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్న సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం) జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పీ 4లో భాగంగా ముత్తుకూరుకు చెందిన 7వ తరగతి విద్యార్థిని వర్షిత, మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన 8వ తరగతి విద్యార్థి యోగేంద్రను దత్తత తీసుకున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని వేదాయపాళెం టీడీపీ కార్యాలయంలో ఆయన దత్తత తీసుకున్న విద్యార్థులకు దుస్తులు, పరుపు, దిండ్లు, ట్రంకుపెట్టెలు, తదితర సామగ్రిని అందించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ గిరిజన బాలిక కాలివేళ్లు నలిగిపోగా, టపాసులు కాలుస్తూ ఎస్సీ బాలుడు యోగేంద్ర చేతివేళ్లు కోల్పోయాడన్నారు. వీరిని గురుకుల పాఠశాలలో చేర్పించి, ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దుతామన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం మనందరి బాధ్యత



ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ



ప్లాస్టిక్ కవర్లను ఎత్తుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులు



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

- జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- వాడవాడలా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర
- పరిసరాలు శుభ్రం చేసిన అధికారులు

నెల్లూరు (జడ్పీ), జూలై 19 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల కోసం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం మనందరి బాధ్యత అని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. నగరంలోని జడ్పీ కార్యాలయంలో శనివారం ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్ బ్యాగ్ వాడడం మంచిదన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పర్యావరణాన్ని కాపాడుకుందాం...

ప్లాస్టిక్‌ను నివారించి, పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.నగరంలోని నుడా కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నుడా సెక్రటరీ పెంచలరెడ్డి, ఏవో రాజు, నుడా సిబ్బంది పాల్గొన్నారు.

● డీఎంహెచ్‌వో కార్యాలయంలో...

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకంతో పలు అనర్థాలు చోటుచేసుకుంటాయని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత అన్నారు. శనివారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్వరాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం వైద్యులు, సిబ్బంది స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదరవలి, డీపీఎంవో డాక్టర్ రమేష్, మలేరియా అధికారి హుస్సేనమ్మ, డెమో కనకరత్నం, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ భాస్కర్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు పాల్గొన్నారు.

● జీజీహెచ్‌లో...

ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో కూడా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. కళాశాలలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ గంగాధర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ కళారాణి పాల్గొన్నారు.

● గుడ్డ సంచులు వినియోగించాలి

నెల్లూరు(సిటీ), (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకునేందుకు గుడ్డ సంచులు వినియోగించాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ అన్నారు. శనివారం మైపాడు రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. కొన్నిచోట్ల ప్రజలకు గడ్డసంచులను అందించారు. అనంతరం పీ4 మార్గదర్శకాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. సంతపేట వద్ద స్వీపింగ్ యంత్రాలను పరిశీలించారు. నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న నక్ష సర్వే అవగాహన తరగతుల్లో పాల్గొన్నారు.

● పోలీస్‌స్టేషన్లలో..

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్నీ పోలీసు స్టేషన్లలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీకే డబ్ల్యూ కళాశాల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఎస్పీ సౌజన్య మాట్లాడుతూ పర్యావరణ సహిత ఉత్పత్తుల వినియోగం, ప్లాస్టిక్ వ్యర్థాల తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జీ.శ్రీనివాసరావు, సింధుప్రియ, చంద్ర మోహన్, ట్రైనీ డీఎస్పీ శివప్రియ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

● ప్లాస్టిక్ వద్దు...జూట్ బ్యాగ్ ముద్దు

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని పత్తేఖాన్‌పేట రైతు బజారు వద్ద ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగు వద్దు జూట్ బ్యాగు ముద్దు అన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎమ్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

● విద్యార్థుల ర్యాలీ

నెల్లూరు(వెంకటేశ్వరపురం) (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురం పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులతో శనివారం స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్‌సీ మస్తానయ్య మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యా ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 80 లక్షలతో గణేష్ ఘాట్ సుందరీకరణ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, పాల్గొన్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరిగే వినాయక చవితి వేడుకలకు మూలాపేట స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణేష్ ఘాట్‌ను రూ.80లక్షలతో సుందరీకరించనున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం గణేష్ ఘాట్‌ను అధికారులు, విక్రమ సింహ పురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఘాట్‌లో నిమజ్జనం కోసం చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈసారి గణేష్ నిమజ్జనాన్ని అద్భుతంగా నిర్వహిస్తామని తెలిపారు. గణేష్ ఘాట్‌కి రూ.80లక్షలు నుడా నిధులు మంజూరు చేసిన నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అభినందనలు తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గణేష్ ఘాట్‌ను, ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పీ.సురేంద్రరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, పిట్టి సత్యనాగేశ్వరరావు, బయ్యా వాసు, వేలూరు మహేష్, మండ్ల ఈశ్వరయ్య, ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, శ్రీకాంత్, కార్పొరేటర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● గణేష్ ఉత్సవాల్లో కోర్కెల గుంజ

ఆగస్టు 27న వినాయక చవితిని పురస్కరించుకుని ఈ ఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు లంబోదర ఉత్సవ కమిటీ నిర్వాహకులు నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని లంబోదర సెంటర్‌లో శనివారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. వచ్చేనెల 27న విగ్రహ ప్రతిష్ఠ దగ్గర నుంచి 31వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. చివరిరోజు 30 కళాబృందాలతో నిమజ్జన ఉంటుందన్నారు. ఈ ఏడాది నూతనంగా ధ్వజ స్తంభం ఏర్పాటుతోపాటు కోర్కెల గుంజను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.తమకు సహకరించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలకు వారు ధన్యవాదాలు తెలిపరు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నగర ప్రముఖులు, దాతలు పాల్గొన్నారు.

డయాలసిస్ యూనిట్లను రక్షించాలని వినతి

నెల్లూరు (వైద్యం) జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జీజీహెచ్‌లో కిడ్నీ డయాలసిస్ యూనిట్లను రక్షించాలని జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులు సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవికి విజ్ఞప్తి చేశారు. శనివారం వారు సూపరింటెండెంట్‌ను కలిసి ఈ మేరకు విన్నవించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ బయ్యా సరోజనమ్మ లయన్స్ పినాకిని డయాలసిస్ సెంటర్లను జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిందన్నారు. ఈ డయాలసిస్ యూనిట్లను ఉపయోగించే క్రమంలో యాసిడ్, సోడియం, బైకార్బ్ వంటివి నాసిరకం వాడటం వల్ల పరికరాలు మరమ్మతుకు గురవుతున్నాయన్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో డయాలసిస్ యూనిట్ నిర్వహణలోపాలను సరిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మొగరాల సురేష్, అబిదా సుల్తానా, దారా మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

కవితా పోటీలకు 40 దేశాల కవులు స్పందన

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్పెయిన్‌కి చెందిన అంతర్జాతీయ రచయితలు, కళాకారుల చాంబర్ (చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 18 వరకు అంతర్జాతీయంగా భారత స్వాతంత్ర్య దినోత్సవంపై కవితల పోటీకి కవితలు ఆహ్వానించిందని ఆ సంస్థ ఇండియాశాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ పెరుగు రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీకి 40 దేశాల కవులు స్పందించి, ఆయా భాషల్లో తమ కవితలు పంపారని ఆయన పేర్కొన్నారు. అందులో భారతదేశానికి చెందిన 10 మంది కవులు భాగస్వామ్యులయ్యారని తెలిపారు.

షాదీమంజిల్ పనులు పూర్తి చేయండి

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జెండావీధిలో గల షాదీమంజిల్ నిర్వహణపై శనివారం మంత్రి నారాయణ క్యాంప్ కార్యాలయంలో నగర కమిషనర్ నందన్‌తో ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ షాదీమంజిల్‌ను పేదవారి కోసం నిర్మించామని అది పేదలకే ఉపయోగపడాలని అన్నారు. షాదీమంజిల్‌లో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసి, వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన పలు కీలక అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చండి : రూరల్ ఎంపీపీ

నెల్లూరురూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లో వ్యవసాయ సీజన్ ముమ్మరంగా ఉన్నందున రైతులకు యూరియా కష్టాలు తలెత్తనివ్వకుండా చూడాలని నెల్లూరు రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్ సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఎడగారు సీజన్‌లో వరి ముమ్మరంగా సాగవుతుందని తెలిపారు. ఈ సమయంలో యూరియా కొరత రానివ్వద్దని స్పష్టం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యను నివారించాలని కోరారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మెరుగైన పాలన గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలేంద్రకుమార్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం.. అందరి బాధ్యత

పొదలకూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత అని పొదల కూరు ఎస్ఐ హనీఫ్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ నుండి పంచాయతీ బస్టాండ్ వరకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సాగిన ర్యాలీలో ఎస్ఐ పాల్గొన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నం సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ కార్యక్రమం నిర్వహించారు.

● కోవూరు : 'స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సీఐ సుధాకరరెడ్డి పిలుపునిచ్చారు. పోలీసు స్టేషన్ ఆవరణ నుంచి బజారు కూడలి దాకా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ రంగనాథ్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

● మనుబోలు : మండలంలోని 19 పంచాయతీల్లో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పంచాయతీ నిర్వహించారు. మడమనూరు పంచాయతీలో ఎంపీడీవో జలజాక్షి, డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అరుణ్‌కుమార్, వీఆర్‌వోలు నాగేంద్ర, గుణశేఖర్, కార్యదర్శి బాబురెడ్డి, టీడీపీ నాయకులు నూనె లక్ష్మయ్య, సుధీర్ పాల్గొన్నారు.



కోవూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది



బుచ్చిలో ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తదితరులు

● బుచ్చిరెడ్డిపాళెం : పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేందుకు కృషి చేద్దామని బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ పిలుపునిచ్చారు. డీఎల్ఎన్ ఆర్ హైస్కూలు వద్దనుంచి జొన్నవాడ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బి. మల్లారెడ్డి, టి. వైష్ణవి, పి. లక్ష్మీకాంతమ్మ, ఆర్. సత్యం, జే. కళ్యాణ్, స్టేట్ చేనేత డైరెక్టర్ టి, నరసింహస్వామి, ఏఈ పూజిత, మెప్మా సీఈఓ నర్మద, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. దామరమడుగు గ్రామ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు డివిజినల్ పంచాయతీ అధికారి డాక్టర్ పుట్టా రమణయ్య, ఎంపీడీఓ నారాయణరెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శులు రాదాకృష్ణ, షబానా, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

● రాపూరు: పట్టణంలోని వివిధ కార్యాలయాల పరిసరాలలో చెత్తను తొలగించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు లక్ష్మీనరసింహం, ఎంపీడీవో భవానీ, ఎస్ఐ వెంకటరాజేష్, పంచాయతీ కార్యదర్శి కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

● సైదాపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ జనార్దన్ తెలిపారు. శనివారం స్థానికంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, సీహెచ్‌వో సొరకాయల చిట్టి, వైద్య సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

పాపాలు చేశారు.. అనుభవిస్తున్నారు!

ఎమ్మెల్యే సోమిరెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అక్రమాలతో పాటు ఎన్నో పాపాలు చేసిన వైసీపీ నాయకులు నేడు ఆ ఫలితాన్ని అనుభవిస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని డమ్మాయిపాలెం పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. సర్వేపల్లిలో అక్రమ మైనింగ్, మద్యం మొదలుకొని మురికి కాలువల దాకా కాకాణి దోచుకున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నీలం మల్లికార్జున్ యాదవ్, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నర్సారెడ్డి, మునుకూరు మురళీధర్‌రెడ్డి, మామిడాల శ్రీనివాసులు, మోడం రామచంద్రారెడ్డి, ఇంగిలాల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చేసిన పనులనే మళ్లీ చేస్తున్నారు..!



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు దిలీప్

విడవలూరు,జూలై 19 (ఆంధ్రజ్యోతి): గాదెలదిన్నె పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని స్థానిక టీడీపీ నాయకుడు వెల్లంపల్లి దిలీప్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల సుమారు రూ.18 లక్షల మేర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గ్రామంలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో నిధులను ఖర్చు చేయాల్సి ఉందన్నారు. అయితే స్థానిక వైసీపీ సర్పంచు, జడ్పీటీసీలు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రోడ్లు, భవనాలు, ఇరిగేషన్ కాలువ స్థలంలో ఎటువంటి నిర్మాణాలను చేపట్టకూడదని గతంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వైసీపీ నాయకులతో అంటకాగుతూ ప్రభుత్వ స్థలంలో మురుగు కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. గతంలో విడుదలైన 15 ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామస్థులు తంగేళ్ల కరుణాకర్, నీలిశెట్టి సుధీర్, కొడిమేర్ల వెంకటేశ్వర్లు, తంగిళ్ల శంబయ్య, సూరి వెంకయ్య, నన్నం చార్ములు, మద్దేల ఏడుకొండలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే కాలుష్య నివారణ

● రిజిస్ట్రార్ డాక్టర్ సునీత

వెంకటాచలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత పిలుపునిచ్చారు. వీఎస్‌యూలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో 'ఒక చెట్టు అమ్మకు అర్పణ' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. విశ్వవిద్యాలయాన్ని హరితవనంగా తీర్చిదిద్దడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ శంకర్, ప్రొఫెసర్లు విజయానంద్‌కుమార్ బాబు, హనుమారెడ్డి, వెంకట్రాయులు, విద్యాప్రభాకర్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న రిజిస్ట్రార్ సునీత

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కొడవలూరు : మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ సంక్షేమ ఫలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. చౌకిచర్ల, దంపూరులో శనివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండల ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్టర్న్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, నాయకులు బెడవాడ వంశీకృష్ణారెడ్డి, ఓగు నాగేశ్వరరావు, కొమ్మిరెడ్డి మురళీరెడ్డి, కొమ్మి శ్రీధర్‌నాయుడు, సురేంద్రరెడ్డి, దూది విజయరాఘవన్, శ్రీనివాసులు, ఈదూరు సురేష్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు : ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో కమ్మపాలెం పంచాయతీ పరిధిలో చంద్రశేఖరపురంలో శనివారం 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, నాయకులు బెల్లం వెంకయ్యనాయుడు, కేతా వెంకటరమణరెడ్డి, చెక్క మదన్, గరికపాటి రాజేంద్రకుమార్, కుందుర్తి నాగేశ్వరరావు, నగేష్, సతీష్, కరకటి మల్లికార్జున పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెంకు 2,500 బస్తాల యూరియా

బుచ్చిరెడ్డిపాళెం : మండలానికి శనివారం 2500 బస్తాల యూరియా చేరింది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు దుకాణాలకు చేరాయి. శనివారం ఆంధ్రజ్యోతిలో 'యూరియా కొరత... రైతన్నల వెత' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి యూరియాను సరఫరా చేశారు. దామరమడుగు, రేబాల, వవ్వేరు సొసైటీలలో 1200, మినగల్లు, రేబాల రైతు సేవా కేంద్రాలలో 800, ప్రైవేటు డీలర్ల వద్ద 500 బస్తాల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి ఎన్. శ్రీహరి తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

వెంకటాచలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఏపీ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడిగా పూడిపర్తి పంచాయతీ కార్యదర్శి కట్టేటి కామేశ్వరరావు, ఉపాధ్యక్షురాలిగా కంటేపల్లి పంచాయతీ కార్యదర్శి రేష్మా సోనీ, ప్రధాన కార్యదర్శిగా ఎగువమిట్ట పంచాయతీ కార్యదర్శి కే వెంకటేష్, కోశాధికారిగా తిక్కవరప్పాడు పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణిలతోపాటు కార్యవర్గ సభ్యులుగా షేక్ ఫిరోజ్, శ్రీనాథ్, హిమబిందులను ఎన్నుకున్నారు. కసుమూరు పంచాయతీ కార్యదర్శి షేక్ ముషీదర్ అధ్యక్షతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు కామాక్షితాయికి శాకంబరి అలంకారం

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా కామాక్షితాయికి శాకంబరి (కూరగాయలు, పండ్లతో) విశేష అలంకారం చేయనున్నట్లు శనివారం ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పండ్లు, కూరగాయలతో మాలలు, తోరణాలను సిద్ధం చేశారు.

పెన్నా నీరు కలుషితం కాకుండా ఇంకుడు గుంతల ఏర్పాటు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ పెన్నానది నీరు కలుషితం కాకుండా గ్రామ పంచాయతీ, ఆలయం, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారులు సమిష్టి ప్రణాళికతో పనులు ప్రారంభించారు. శనివారం స్థానిక సర్పంచు కే.పెంచలయ్య, గ్రామ పంచాయతీ అధికారులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మురుగు నీరు నదిలో కలవకుండా రెండు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు.

ప్రసన్న వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

విడవలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన విడవలూరులో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెండి ఆభరణాలతో విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ చైర్మన్ పొన్నలూరు బుజ్జిరెడ్డి, బుజ్జిరెడ్డి, సుజాతమ్మ ఉభయకర్తలుగా ఉండి కార్యక్రమం నిర్వహించారు.



సహస్ర దీపాలంకరణ సేవలో ఉత్సవ మూర్తులు



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న పద్మనాభయ్య, త్రిపుర దంపతులు

వైభవంగా శ్రీవారి కల్యాణం

రాపూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శనివారం శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి చందనాలంకరణ చేశారు. అనంతరం దేవేరులతో శ్రీవారి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, రాత్రి ఊంజల్‌సేవ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఉచిత ప్రసాదంతోపాటు అన్నప్రసాదం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

పెంచలకోన క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్న దాన పథకానికి కడప జిల్లా వాస్తవ్యులు పోరుబోట్ల పద్మనాభయ్య, త్రిపుర కుమారి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. అలాగే సైదాపురం మండలం ఊటుకూరి వాస్తవ్యులు మలినేని సాయితేజ వారి తల్లిదండ్రులు శ్రీరాములు, లక్ష్మీ పేర్లమీద రూ. 31,250 విరాళం అందించారని ఆలయ ఉప కమిషనర్ ప్రకటించారు. దాతలు శ్రీవార్లను దర్శించుకుని పూజలు చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు.

ఇలా అయితే ప్రమాదాలు జరగవా..

సంగం మండలంలోని పెరమన, జంగాలదొరువు గ్రామాలకు చెందిన 6 నుంచి 10వ తరగతి వరకు చదివే సుమారు 30 మంది విద్యార్థులు ప్రతిరోజు సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చి చదువుకుంటున్నారు. పెరమన గ్రామం ఆత్మకూరు - నెల్లూరు రహదారికి 3 కిలోమీటర్ల దూరం, జంగాలదొరువు గ్రామం 7 కిలోమీటర్ల దూరం ఉంది. అయితే ఉదయం 7-30 గంటలకు ఆత్మకూరు డిపోకు చెందిన ఏయస్‌పేట - కసుమూరు బస్సు ఈ రెండు గ్రామాల మీదుగా వెళ్తుంది. ఉద యం 9గంటలకు పాఠశాల కావడంతో ఈ బస్సులో వెళ్తే గంట ముందుగా పాఠశాలకు వెళతారు. దీంతో ప్రతిరోజు పెరమన విద్యార్థులు 20 మంది ఒక ఆటోలో 8-30 గంటలకు బయలుదేరి వెళతారు. అదేవిధంగా జంగాలదొరువులో పది మంది విద్యార్థులు పాల వ్యాన్‌లో పాఠశాలకు వెళ్తున్నారు. పరిమితికి మించి ఆటోలో వెళ్తున్నారు. అందులోనూ ముంబాయి జాతీయ రహదారిపై ప్రయాణం కావడంతో అటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక తల్లిదండ్రులు విద్యార్థులను ఆటోల్లో పంపుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)



పాలవ్యాన్‌లో ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

స్లాట్ బుకింగ్‌కు వసూళ్లు

- రూ.వేలు దండుకుంటున్న దళారులు
- రిజిస్ట్రేషన్‌శాఖలో తొలగని మధ్యవర్తుల పెత్తనం

నెల్లూరు(హరనాథపురం), జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆస్తులు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వం స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానాన్ని తీసుకుని వస్తే, ఈ విధానం ద్వారా దళారులు రూ. వేలు దండుకుంటున్నారు. ప్రజలకు పారదర్శకత కోసం, లంచగొండితనాన్ని నివారించడం, దళారుల ప్రమేయాన్ని అరికట్టడానికి ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకువచ్చింది. ఈ విధానం వల్ల ఆస్తులు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్లు చేయించుకునేవారు నేరుగా ఆన్‌లైన్‌లో తమకు నచ్చిన తేదీ, టైం కోరుతూ రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్ రిజిస్ట్రేషన్ కోసం, రిజిస్ట్రేషన్ వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ వివరాలను ఆన్‌లైన్ ఫారంలో నింపాలి. ఆ తరువాత ఐడీ వస్తుంది. ఈ ఐడీ ఆధారంగా రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి, స్లాట్ బుక్ చేసుకుని, ఆ సమయానికి కార్యా లయానికి వెళ్లాలి. స్లాట్ బుక్ చేసుకోడానికి ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన పనిలేదు. కానీ స్లాట్ రద్దు చేసు కుంటే మాత్రం రూ.100 చెల్లించాలి. రద్దు చేసుకున్న స్లాట్‌ను మళ్లీ బుక్ చేసుకుంటే రూ.200 చెల్లించాలి. సెలవురోజుల్లో కూడా స్లాట్ బుక్ చేసుకోవచ్చు.



● దళారుల ఇష్టారాజ్యం

జిల్లాలోని రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయాల్లో దళారులు రాజ్యమేలుతున్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి వచ్చే వారికి తామే రిజిస్ట్రేషన్లు చేయిస్తామని, కార్యాలయ అధికారులకు డబ్బులు ఇవాల్సి ఉంటుందని చెప్పి రూ.వేలు రూ.లక్షలు దండుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లకుండా వారు జాగ్రత్తలు వహస్తున్నారు. స్లాట్ బుకింగ్ తెలి యని ఎందరో వీరిని ఆశ్రయిస్తున్నారు. అయితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సబ్ రిజిస్ట్రార్‌లను కానీ, ఇతర ఉద్యోగులను కానీ వారు సంప్రదించటం లేదు. ఇదే అదునుగా భావించిన దళారులు దండకాలు మొదలు పెట్టారు. ఆస్తుల పత్రాలు అన్నీ బాగున్నా దళారులు రూ.వేలల్లో, రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారు. వీరి దందాను అరికట్టాల్సిన అవసరం ఉంది.

దళారులను నమ్మొద్దు

స్లాట్‌బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మినహా అదనంగా ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. దళారులను నమ్మి మోసపోవద్దు. అన్ని ఫీజులను రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో అడిగి తెలుసుకుని చెల్లించాలి.

- ఐ. విజయరాణి, జాయింట్‌సబ్ రిజిస్ట్రార్



పారిశుధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ ఆనంద్

పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవటం

సంతోషదాయకం : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను గౌరవించుకో వటం ఆనందదాయకమని కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో పారి శుధ్య కార్మికులకు సన్మానం జరి గింది. వారిని శాలువాతో సన్మానించి, వారికి అవసరమైన రక్షణ పరికరాల కిట్లను ఆయన అంద చేశారు. అనంతరం మాట్లా డుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మొదటి వ్యక్తి పారిశుధ్య కార్మికుడేనని అన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ చెప్పారు.

పారిశుధ్య సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరు

గ్రామస్థాయిలో తాగునీటి, పారిశుధ్య సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయడానికి డీపీవో కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబరు 1800-425-0017ను ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. గ్రామీణులు వారి ప్రాంతాల్లోని ఆయా సమస్యల పరిష్కారానికి ఈ నెంబరుకు కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఓవై నందన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గోను చిట్టిబాబు, గులాం షఫీ అహ్మద్, గడ్డం శశి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు సంబంధించి రైతుల అభ్యంతరాల స్వీకరణ

రాపూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం నుంచి శ్రీసిటీ వరకు వేస్తున్న పైప్‌లైన్‌కు సంబంధించి మండలంలోని వీరాయపాలెం, గిలకపాడు గ్రామాల రైతులతో నెల్లూరు ఆర్డీవో నాగసంతోషిణీ అనూష శనివారం భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో వీరాయపాలెం నుంచి ఇద్దరు రైతులు, గిలకపాడు గ్రామం నుంచి 13 మంది రైతుల వద్ద నుంచి ఆధార్‌కార్డు వివరాలు, అడంగల్ వివరాలు, అభ్యంతరాలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ పైప్‌లైన్ కాంట్రాక్టర్ అధికారులు, రైతులతో సమన్వయ చర్చా కార్యక్రమం మరోసారి జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ డీటీ రవీంద్రా, తహసీల్దారు లక్ష్మీనరసింహం, ఆర్ఐ రవితేజ, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో చర్చిస్తున్న ఆర్డీవో నాగసంతోషిణీ అనూష

ముగ్గురు చిన్నారుల కిడ్నాప్‌నకు యత్నం

● పిల్లలు కేకలు వేయడంతో దుండగుల పరార్

ఇందుకూరుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : గంగపట్నం పంచాయతీ శ్రీనివాసపురం గిరిజన కాలనీలో శనివారం రోడ్డు పక్కన ఆడుతున్న ముగ్గురు చిన్నారులను గుర్తు తెలియని దుండగులు రెండు బైకులు, ఒక కారులో వచ్చి కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. దీంతో చిన్నారులు కేకలు వేశారు. వెంటనే తల్లిదండ్రులు రావడంతో దుండగులు పరారయ్యారు. విషయం తెలియగానే ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సీసీ ఫుటేజ్ పరిశీలించి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 858 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 622 బేళ్లను కొనుగోలు చేశారు. 236 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 159గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

ఆక్రమిత ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

● వెంటనే ధ్వంసం చేసిన ఆక్రమణదారుడు

కొండాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఆ భూమిలోకి ఎవ్వరూ వెళ్లరాదంటూ రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ బోర్డును ఆక్రమణ దారుడు క్షణాల్లోనే ధ్వంసం చేశాడు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని గానుగపెంట పంచాయతీలో సర్వే నెంబరు 18లో సుమారు 2 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమి స్థానిక ఆదర్శ పాఠశాలకు ఎదురుగా, తహసీల్దారు కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉంది. ఆ భూమిని కొండాపురంకు చెందిన సుధాకర్ అనే వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడని గానుగపెంట సర్పంచు మంచాల మల్లికార్జున రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిగా నిర్ధారించి ఎవ్వరూ వెళ్లరాదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డు ఏర్పాటు చేసిన వెంటనే ఆక్రమణదారుడు కుమారుడు ధ్వంసం చేసినట్లు సర్పంచు మల్లికార్జున తెలిపారు. విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి విడిపించాలని రెవెన్యూ అధికారులతోపాటు జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో కొండయ్య, సర్పంచు మల్లికార్జున

రూ. 68 లక్షలతో మంచినీటి ట్యాంకు నిర్మాణం

జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ రెడ్డయ్య

మనుబోలు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టువపల్లిలోరూ.68.20 లక్షలతో మంచినీటి ట్యాంకును నిర్మించనున్నట్లు జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ రెడ్డయ్య తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కట్టువపల్లిలో మంచినీటి ట్యాంకు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం యాచవరం నుంచి వస్తున్న మంచినీటి పైపులైనును పరిశీలించారు. కొన్ని సంవత్సరాలుగా మనుబోలు పంచాయతీలోని యాచవరం గ్రామంలో ఉన్న ట్యాంకు నుంచి పైపులైన్ల ద్వారా కట్టువపల్లికి, కొలనుకుదురుకు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే చొరవతో కట్టువపల్లి గ్రామస్తులకు గ్రామంలోనే మంచినీటి ట్యాంకు మంజూరైందన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రెండు గ్రాంట్లతో మంచినీటి ట్యాంకు, సంపు నిర్మాణాలు చేయిస్తామన్నారు. 90వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకు ఏర్పాటు కాబోతుందన్నారు. అంతకు ముునుపు గ్రామంలోని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ.ఐ. వెంకటేశ్వర్లు, ఏఈ. కసనా నాయక్, టీడీపీ నాయకులు మహేంద్ర, మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.



కట్టువపల్లిలో మంచినీటి ట్యాంకుకు స్థల పరిశీలన చేస్తున్న జిల్లా గ్రామీణ నీటిసరఫరా శాఖ ఈఈ రెడ్డయ్య



క్యూఆర్ కోడ్ చూపించి మాట్లాడుతున్న ఆనం

మెట్టప్రాంత యువత కోసమే

మెగా జాబ్‌మేళా

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

చేజర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంత యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకే మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పెరుమాళ్లపాడు సమీపంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ సహకారంతో ఆగస్టు 1, 2వ తేదీలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి, మంత్రి నారాయణ, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఐటిఐ, పాలిటెక్నిక్, ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్యనభ్యసించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే జాబ్‌మేళా ధ్యేయమని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించేందుకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా యువత పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కాగా, ఆత్మకూరు నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు.

మహిళపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం) : ఒకరి బంగారు సరుడును తీసుకెళ్లి తాకట్టుపెట్టిన మహిళపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, మన్సూర్‌నగర్‌లో ఉంటున్న రాధ వద్దకు అదే ప్రాంతానికి చెందిన ఇందిర వచ్చింది. బంధువుల వివాహం ఉందని, బంగారు సరుడు ఇస్తే పెళ్లయ్యాక ఇచ్చేస్తానని చెప్పింది. దీంతో రాధ తన మెడలోని రెండున్నర సవర్ల బంగారు సరుడును ఆమెకు ఇచ్చింది. రోజులు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన రాధ ఆరాతీయగా సరుడు తాకట్టులో ఉన్నట్లు తెలిసింది. ఇందిరపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నగరంలో యువకుడి దారుణహత్య



వంశీకృష్ణ(ఫైల్)

నెల్లూరు(క్రైం), జూలై 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం భగత్‌సింగ్‌కాలనీ జగనన్న కాలనీలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైనట్లు శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు సమాచారం మేరకు, జగనన్న కాలనీలో మణి, కుమారి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమార్తె, కుమారుడు వంశీకృష్ణ (24) ఉన్నారు. వంశీకృష్ణ క్యాటరింగ్ పనులు చేసేవాడు. శుక్రవారం మణి భార్యతో కలిసి కిసాన్‌నగర్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లాడు. రాత్రి వంశీకృష్ణ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఆయన శుక్రవారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. తలపైన బలమైన ఆయుధం తో కొట్టి, కత్తులతో విచక్షణరహితంగా దాడిచేయడంతో ఆయన మృతిచెం దాడు. శనివారం ఉదయం వంశీకృష్ణకు తల్లిదండ్రులు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో వారు ఇంటికి వచ్చి చూడగా కుమారుడు రక్తపుమడుగులో విగతజీవిగా పడిఉండటంతో వారు కన్నీరుమున్నీర య్యారు. ఈ ఘటనపై వారు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. నగర డీఎస్పీ పీ. సింధుప్రియ, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. హత్యకు దారితీసిన పరిస్థితులపై విచారణ చేపట్టారు.

● స్నేహితుడే హతమార్చాడా...?

కాగా వంశీకృష్ణకు మధురానగర్‌లో ఓ స్నేహితుడు ఉన్నాడు. వారిద్దరి మధ్య కొంతకాలంగా మనస్పర్థలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం స్నేహితుడి ఇంట్లోని వస్తువులను వంశీకృష్ణ ధ్వంసం చేశాడు. దీంతో వారి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో స్నేహితుడే హత్యకు పాల్పడినట్లు అనుమానాలు ఉన్నాయి. ఆ దిశగా పోలీసులు విచారణ చేస్తున్నారు. వంశీ స్నేహితుడి కోసం ఇంటివద్దకు వెళ్లగా, ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో మరింతగా అను మానం బలపడింది. దీంతో అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మూడిళ్లలో విలువైన సొత్తు చోరీ

నెల్లూరు(క్రైం), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిన్నబజారు, వేదాయపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలోని మూడిళ్లలో రూ.లక్షల విలువ చేసే సొత్తును దొంగలు దోచుకెళ్లారు. సాయినగర్‌లో ఉమాకాంత్ దంపతులు నివాసం ఉంటున్నారు. ఆయన టీ స్టాల్‌లో పనిచేస్తుండగా ఆయన భార్య బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరూ శనివారం పనులకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని మూడున్నర సవర్ల బంగారు నగలను దోచుకెళ్లారు. రాత్రి వచ్చిన బాధితులు తలుపులు తెరిచి ఉండటం, బీరువాలోని ఆభరణాలు కన్పించకపోవడంతో చోరీ ఘటనపై చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మనుమసిద్ధి నగర్ ఆరోవీధిలో సోమశ్వరి కుటుంబం శనివారం ఒంగోలుకు వెళ్లింది. గుర్తుతెలియని దుండగులు ఇంట్లోని సుమారు 20 సవర్లకుపైగా బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. రాత్రి ఇంటికి చేరుకున్న వారు తలుపులు తెరిచి ఉండటంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● వేదాయపాలెం పరిధిలో..

వేదాయపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని నిర్మలానగర్‌లో పిచ్చయ్య దంపతులు ఉంటున్నారు. ఇద్దరూ ఉపాధ్యాయులు. శనివారం వారు స్కూలుకు వెళ్లగా గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని సుమారు 30 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చిన బాధితులు తలుపులు తెరిచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలోని ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్వోబీ సమస్య మళ్లీ మొదటికి..

- జాయింట్ల వద్ద కుంగిన రోడ్డు
- మరమ్మతుల కోసం పగుల కొట్టిన కాంట్రాక్టర్
- వంతెనపై స్తంభిస్తున్న ట్రాఫిక్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కావలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): సరైన సాంకేతిక పరిజ్ఞానం లేకుండా కావలి పట్టణ ఉదయగిరి రైల్వే ఓవర్ బ్రిడ్జిపై కొత్త రోడ్డు వేసినా సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఆ వంతెన జాయింట్లు వద్ద కుంగి గుంతలు పడటంతో గత వైసీపీ పాలనలో ఐదేళ్ల రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి-దుత్తలూరు జాతీయ రహదారికి ఆ వంతెన మార్గం కనెక్టివిటీ రోడ్డుగా గుర్తించి గుంతలు లేకుండా మొత్తం తారురోడ్డు వేశారు. దీంతో కావలి ప్రజలతోపాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఆనంద పడ్డారు. అయితే కొత్త రోడ్డు వేసేటప్పుడు జాయింట్ల వద్ద సరైన సాంకేతికతతో చేయకుండా మామూలుగా రోడ్డు వేశారు. దీంతో కింద ఉన్న కాంక్రీట్ పిల్లర్ల స్పాన్‌ల మధ్యలో ఉన్న జాయింట్ల వద్ద రోడ్డు కిందకు కుంగి మళ్లీ గుంతలు పడటం ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో జాతీయరహదారి అధికారులు జాయింట్ల మధ్య కుంగకుండా పటిష్ఠంగా నిర్మాణం చేపట్టేందుకు జాయింట్ల వద్ద పగులుకొడుతున్నారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో కావలి ప్రజలతో పాటు ఉదయగిరి మార్గం వైపు రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు వంతెనకు రెండు వైపులా ఉండి వన్‌వే ట్రాఫిక్‌కు అవకాశం ఇవ్వకుండా వదిలి వేస్తుండటంతో వాహనచోదకులు వంతెనపై ఇరుక్కుని గంటల తరబడి ఉండాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి శనివారం రాత్రి జరిగింది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి అక్కడ పోలీస్‌లను పెట్టి ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ సారైనా జాయింట్ల వద్ద మళ్లీ కుంగకుండా నూతన సాంకేతికతతో పటిష్ఠంగా నిర్మాణం చేపట్టాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.



ఆర్వోబీపై స్తంభించిన ట్రాఫిక్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100) : 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9445
వెండి కిలో ధర	రూ. 115800
వెండి ఒక గ్రాము	రూ.118.80

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో కావలికి 12వ ర్యాంకు

● అవార్డు అందుకున్న మున్సిపల్ అధికారులు

కావలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలలో కావలి పురపాలక సంఘానికి రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు వచ్చింది. దీంతో శనివారం తిరుపతిలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి నుంచి కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌లు ర్యాంకుకు సంబంధించిన అవార్డును అందుకున్నారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతోనే అభివృద్ధి

కొండాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటుతోనే అన్ని రంగాలు అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య అన్నారు. కొండాపురంలో ఆపార్టీ 3వ మహాసభలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మిట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వరంగ సంస్థను ఏర్పాటు చేయలేదన్నారు. దేశంలో పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తున్నారే తప్ప సామాన్యులను, రైతులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. ఏర్పాటు చేసిన సంస్థలు దివాళాతీస్తే వారికి రుణాలు రద్దు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, కావలి నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కొండబిట్రగుంటలో వైద్య శిబిరం

బిట్రగుంట, జూలై 19(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు సత్యనారాయ చార్యులు ఆధ్వర్యంలో ఉచిత మర్మకళ, ఆయుర్వేద వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. మర్మకళ హీలర్స్ ఏ.చంద్రశేఖర్, డీ.బాలాజీ, ఆయుర్వేద వైద్యుడు పెంచలరావు రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, తులసీరాంబాబు, పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.8,54,723

వలేటివారిపాలెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.8,54,723 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కాకర్ల ఆర్థికసాయం

జలదంకి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెంకు చెందిన సత్తెనపల్లి చందు, పోట్లూరి శ్రీనివాసులు అగ్నిప్రమాదంలో ఇటీవల గాయపడ్డారు. వారికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆర్థికసాయం చేశారు. క్షతగాత్రులను కావలి వైద్యశాలలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఉప్పుటూరి సుధీర్‌బాబు శనివారం పరామర్శించి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున ఎమ్మెల్యే అండించిన ఆర్థికసాయంను కుటుంబ సభ్యులకు అందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఇంటూరి



కందుకూరు : పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, అధికారులు

కందుకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపం వద్ద స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవీ కాలనీలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి ప్లాస్టిక్ వద్దు - పేపరు బ్యాగులు ముద్దు నినాదంతో అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగించబోమని అధికారులు, ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. అనూష, పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కావలి : ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎస్పీ వీ.శ్రీధర్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో పోలీస్‌లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక డీఎస్పీ కార్యాలయం నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం బ్రిడ్జి సెంటర్‌లో మానవహారం నిర్వహించి ప్లాస్టిక్ నియంత్రణ, పారిశుధ్యం మెరుగుదల కోసం అందరం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు ఫిరోజ్, గిరిబాబు, రాజేశ్వరరావు, పాపారావు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే లింగసముద్రం, వలేటివారిపాలెం, కొండాపురం, అల్లూరు తదితర మండలాల్లో అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు.



కావలి : బ్రిడ్జి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కార్యదర్శి సిద్దేశ్వరికి కలెక్టర్ ప్రశంసలు



కార్యదర్శి సిద్దేశ్వరిని సత్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

అల్లూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పురిణి పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వరిని జిల్లా కలెక్టర్ ఆనంద్ శనివారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో సత్కరించారు. చెత్తసేకరణలో ఉత్తమ అధికారిణిగా ఆమె ఎంపికైన విషయం విదితమే. ఈ క్రమంలో ఆమెను ప్రోత్సహించేందుకు శాలువాతో సత్కరించి అభినందించారు. మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులకు ఆమె ఆదర్శంగా నిలిశారని ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర తెలిపారు.

తలసేమియా బాధితుల కోసం 2కే నడక

కావలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పుట్టుకతో వచ్చే తలసేమియా, సికిల్‌సెల్ అనిమియా వ్యాధులు ఉన్న చిన్నారుల కోసం విశాఖపట్నంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిర్వహిస్తున్న 10కే రన్‌కు సంఘీభావంగా శనివారం కావలి పట్టణంలో 2కే నడక నిర్వహించారు. స్థానిక బీపీఎస్ నుంచి రెడ్‌క్రాస్ భవనం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. ఐలవ్ కావలి ఐకాన్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఉన్న తలసేమియా డే కేర్ సెంటర్ వద్దకు ర్యాలీ చేరుకుంది. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కావలి ఛైర్మన్ డీ. రవిప్రకాష్, డాక్టర్ పీ. శ్రీధర్, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కే. సుబ్బారావు, డాక్టర్ గోపి, రోటరీక్లబ్ అధ్యక్షుడు ఏ. రమేష్ రెడ్డి, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ టీ.రమ్య, ఆరికట్ల మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.



తలసేమియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జలదంకి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం రాత్రి జరిగింది. వివరాల మేరకు.. మండలంలోని జమ్మలపాలెంలో జాతీయరహదారిపై కారుకు పెట్రోలు పట్టించుకునేందుకు మలుపు తిప్పుతుండగా వెనుక వైపు వస్తున్న మోటార్‌బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కావలి బుడంగుంటకు చెందిన శెట్టిపల్లి వివేక్, పోతిపోగు మాతయ్యలు గాయపడ్డారు.

అందరికీ బ్యాంకింగ్ సేవలు అందాలి : సబ్ కలెక్టరు



మాట్లాడుతున్న సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ

కందుకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు కూడా బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ పేర్కొన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా 118వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం స్థానిక బ్రాంచ్‌లో నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెస్తే వారు ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటు రికవరీ శాతం కూడా బాగుంటుందని పేర్కొన్నారు. విదేశాలలో సైతం సేవలందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ కందుకూరులో ఉండటం ఈప్రాంత ప్రజలకు వరమన్నారు. బ్యాంక్ మేనేజరు సుదర్శి మధుసూదనరావు మాట్లాడుతూ బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పి.శ్రీనివాసులు, జయంత్ చేతన్, మౌనిక, కీర్తిదేవన్, సంషాద్ బాషా, సురేష్, బొల్లినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : రైతులకు అవసరమైన పంట రుణాలు, బంగారు రుణాలతోపాటు, వ్యాపార వర్గాలకు అధికప్రాధాన్యమిస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడ కలిగిరి శాఖ మేనేజర్ సురేష్ తెలిపారు. స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడ శాఖలో శనివారం బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుశాఖ పట్టణంలో ఏర్పాటు చేసినప్పటి నుంచి ఖాతాదారులకు అవసరమైన అన్ని బ్యాంకు సేవలు అందిస్తూ స్నేహభావంతో మెలగడం మంచిపరిణామంగా పేర్కొన్నారు. అనంతరం బ్యాంకు అభివృద్ధికి తోడ్పడిన పలువురి ఖాతాదారులను ఘనంగా సన్మానించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌కు ఫ్యానులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



ఖాతాదారులను సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

మోపాడులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

కందుకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోపాడులో శనివారం రాత్రి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పర్యటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీ కృష్ణారెడ్డి, హరికృష్ణ, ఆర్.రవి, టీ.ఏడుకొండలు, బీ.సింగయ్య, టీ.వీరేష్, బీ.నారాయణ పాల్గొన్నారు.

● **లింగసముద్రం:** మండలంలోని పెదపవనిలో వెలసియున్న గ్రామ దేవత పోలేరమ్మకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి సాంబయ్య, జి కల్పన, వంకాయలపాటి మాల్యాద్రి, రామిశెట్టి మాలకొండయ్య పాల్గొన్నారు.

బదిలీ అయిన వెటర్నరీ అసిస్టెంట్లకు సన్మానం

వలేటివారిపాలెం, జూలై 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వలేటివారిపాలెం అసిస్టెంట్ డైరెక్టర్ చెన్నకేశవులను, చుండి, అంకభూపాలపురం గ్రామ సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్లుగా పని చేస్తూ బదిలీ అయిన ఉప్పుటూరి కిరణ్‌కుమార్, ఆరితోటి రమేష్‌లను వలేటివారిపాలెం ఏరియా పశువైద్యశాలలో శనివారం శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌రావు, వలేటివారిపాలెం, కందుకూరు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్‌లు చంద్రమోహన్, చెన్నకేశవులు, పోకూరు, లింగసముద్రం పశువైద్యులు సుధాకర్, సుబ్రహ్మణ్యం, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలి

కావలి(టౌన్), జూలై 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న కార్మికుల సమ్మె శనివారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్యాలయం నుంచి చేపట్టిన ప్రదర్శన ట్రంకురోడ్డు మీదుగా ఆర్టీసీ కూడలి వరకు సాగి తిరిగి సమ్మె శిబిరం వద్దకు చేరుకుంది. పెంచలనరసయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలని ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించి అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణమోహన్, పెంచలయ్య, మధుసూదన్‌రావు, యూనియన్ నేతలు తురకా శీనయ్య, బీ.మహేష్, ఓ.రమేష్, అనిత, చిన్నమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

హౌసింగ్‌లో అవినీతిపై చర్యలు తీసుకోండి

కావలి(టౌన్), జూలై 19(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ గోడౌన్‌లో స్టీల్, సిమెంట్ గోల్‌మాల్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత మిడతల రమేష్ ఆ పార్టీ నేతలతో కలిసి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హౌసింగ్‌లో అవినీతి పరులను నీతివంతులుగా మార్చే ప్రక్రియను అధికారులు కావలి నుంచే ప్రారంభించారని ఆరోపించారు. 6,000 బస్తాల సిమెంట్, 24 టన్నుల స్టీల్ కావలి గోడౌన్‌లో మాయమైందన్న విషయాన్ని హౌసింగ్ అధికారుల ధ్రువీకరించారని ఆరోపించారు. అవినీతి అధికారులపై పోలీసు కేసులు పెట్టి విచరణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంద కిరణ్, బ్రహ్మానందం, పరుసు వెంకటేశ్వర్లు, సవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన తహసీల్దారు

కలిగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధన కొండూరులో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఇన్‌చార్జ తహసీల్దారు గిరీష్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజన సదుపాయం, మౌలిక వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకోవాలని వార్డెన్ ఉమాశంకర్‌కు సూచించారు. వసతిగృహ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న ఫ్లోరోసిస్ వైద్య అధికారిణి దివ్య

ఏఎస్ పేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరమన పీహెచ్‌సీలో శనివారం జిల్లా ఫ్లోరోసిస్ వైద్య అధికారిణి దివ్య ఫ్లోరోసిస్ వ్యాధిపై వైద్య, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం కావలి ఎడవల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని 3,4,5వ తరగతి విద్యార్థులకు దంత పరీక్షలు చేసి విటమిన్ సి మాత్రలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతిరాణి, నాగ వినూత్న, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

అనంతసాగరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. కొత్తపల్లిలో గృహ నిర్మాణశాఖ అధికారులతో కలసి శనివారం పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇళ్లప్రగతిని పరిశీలించారు.

బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఉదయగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ, మండలంలోని గడ్డంవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సముదాయ సమావేశాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల సముదాయ ఛైర్మన్‌లు షరీఫ్, వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ఉదయగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఏఈవోలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవిచంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. స్వచ్ఛాంధ్ర సాధిద్దాం

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



వింజమూరు: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం... స్వచ్ఛాంధ్ర సాధిద్దాం అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బంగ్లా సెంటర్ నుంచి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పెరటితోటను ప్రారంభించి తోటలోని కూరగాయ మొక్కలను పరిశీలించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని దుకాణాల వద్దకు వెళ్లి దుకాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు మండల నాయకులు గురజాల వాసు, ఆనంది రమణయ్య, డేగా మధు యాదవ్, బండారు సత్యనారాయణ, సర్పంచ్ సృజన, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ మాలకొండయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** పట్టణంలోని సినిమాహాలు వీధిలో ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లాలు వీధులను శుభ్రం చేయించి ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రాంమోహన్ సిబ్బందిచే ఫైళ్ల గదులను శుభ్రం చేయిం చారు. అలాగే ఎస్ఐ అల శ్రీను ఉన్నత పాఠశాల విద్యార్థులచే రంగనాయకులస్వామి ఆలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్ట ర్ జీ.కృష్ణారెడ్డి అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

●**దుత్తలూరు:** స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి దుత్తలూరు సెంటర్ వరకు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అనంతరం 565 జాతీయ రహదారిపై మానహారం ఏర్పాటు చేశారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నాగరాజు ఫైళ్ల గదులను శుభ్రం చేయించారు.

●**సంగం:** తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లానాయక్ ఆధ్వర్యంలో కార్యాలయంలో శుభ్రంచేసి చెత్త తొలగించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్, పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ అశోక్ క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. ఎస్ఐ రాజేష్ విద్యార్థులచే ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పాఠశాలల్లో హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఆట స్థలాలు శుభ్రంచేసి ర్యాలీలు నిర్వహించారు.

●**మర్రిపాడు:** ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలంటూ ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జనార్ధన్ నాయుడు, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసరావు షాపులకు తిరిగి యజమానులకు అవగాహన కల్పించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు శాఖమూరి నారాయణ, ఎలగాల వెంకటేశ్వర్లు, అంగన్వాడీ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

●**ఏఎస్ పేట :** తహసీల్దారు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలను శుభ్రం చేయించారు. ఎస్ఐ సైదులు విద్యార్థులతో కలసి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి, పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరమంటూ అనంతసాగరంలో శనివారం విద్యా ర్థులు, అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుడ్డ సంచులు వినియోగించాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సూచించారు. ఈవోపీఆర్డీ రామ చంద్రయ్య, కార్యదర్శి అంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో శ్రీనివాసు లరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయ ప్రాంగ ణంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మి, ఏపీవో ఆజంఖాన్, సీహెచ్‌వో రాజశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్, సచివాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శి రామ్‌నాధరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న చెత్తా చెదారంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యస్థాని, కానిస్టేబుల్స్ ప్రవీణ్, విజయ్, రవి, విజయలక్ష్మి, తిరుపతిరావు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సుమారు 18 శాఖల పరిధిలో అధికారులు పాల్గొనాల్సి ఉండగా కేవలం 8 మంది మాత్రమే హాజరయ్యారు. 24 మంది సర్పంచులకు గాను నలుగురు, 9 మంది ఎంపీటీసీలకు గాను నలుగురు మాత్రమే హాజరయ్యారు. కాగా, కొంతమంది అధికారులు తమ శాఖ పరిధిలోని సమాచారాన్ని వివరించారు. ఈవిషయమై ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్లపడియలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లపడియ పంచాయతీ గ్రామాల్లో టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించి కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వాడకొప్పు మాల్యాద్రి, నరసింహులనాయుడు, ఉప్పు కోనయ్య, దుదుకూరి రమణయ్య, పాపయ్య, అనిల్, గోపి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పీ-4 సర్వే గ్రామ సభలు

సీతారామపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 9 సచివాలయాల పరిధిలోని 14 పంచాయతీల్లో సోమవారం నుంచి పీ-4 సర్వే గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పాజీ శనివారం తెలిపారు. 21న అయ్యవారిపల్లి, నెమళ్లదిన్నె, జయపురం, పబ్బులేటిపల్లి, చిన్నాగంపల్లి, సింగారెడ్డిపల్లి, పంచాయతీల్లో, 22న దేవిశెట్టిపల్లి, దేవరాజుసూరయపల్లి, దేవమ్మచెరువు, బసినేనిపల్లి, బాలాయపల్లి, గుండుపల్లి, మారంరెడ్డిపల్లి, సీతారామపురం పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం

మున్సిపల్ ఉద్యోగుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

ఆత్మకూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయు నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకుడు జి శివప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు జీవో నెంబరు 36 ప్రకారం వెంటనే జీతాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ యూనియన్ నాయకులు నాగేంద్ర, గురవయ్య, చానబాబు, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ తిరుపతి

దేశానికి ఆదర్శం కావాలి!

శ్రీవారి పాదాల చెంతకు హంద్రీ జలాలు

తిరుపతి ప్రజా వేదికలో సీఎం చంద్రబాబు



తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దేశానికంతా పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి స్వచ్ఛతలో కూడా దేశానికి ఆదర్శం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రజా వేదికలో మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర ప్రభుత్వం సూపర్ సిటీస్ కేటగిరీలో తిరుపతికి ఉత్తమ అవార్డు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశం నలుమూలల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచీ కూడా భక్తులు శ్రీవారి దర్శనం కోసం తిరుపతి వస్తున్న నేపథ్యంలో నగరంలో పరిశుభ్రత ప్రతిఫలించాలని సూచించారు. నగరం శుభ్రంగా లేకుంటే భక్తులకు తిరుపతి మీద సదభిప్రాయం కలగదని హెచ్చరించారు. అవార్డుల్లో ఫైవ్ స్టార్ ర్యాంకింగ్ సాధించిన తిరుపతి భవిష్యత్తులో సెవెన్ స్టార్ ర్యాంకింగ్ సాధించాలని పిలుపునిచ్చారు.

రూ. 150 కోట్లతో మోడల్ సిటీగా తిరుపతి

గత ప్రభుత్వ నిర్వాకం వల్ల తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద పలు పనులు మిగిలిపోయాయని చంద్రబాబు గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టు కింద పలు రోడ్లు, డ్రైయిన్ పనులు పెండింగులో వున్నాయన్నారు. రూ. 150 కోట్లతో తిరుపతిని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ప్రకటించారు. దివ్యక్షేత్రంగా వున్న తిరుపతిని విద్యా కేంద్రంగానూ, నాలెడ్జి ఎకానమీ హబ్‌గానూ అభివృద్ధి చేస్తామన్నారు. శ్రీవారి పాదాల చెంత వివాహాలు చేసుకునే విధంగా వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరుపతిని మారుస్తామన్నారు. దానికోసం ఉత్తమ మౌళిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

జిల్లా రుణం తీర్చుకుంటా!

రూ. 3850 కోట్లతో 550 కిలోమీటర్ల మేరకు కాలువ తవ్వించి కుప్పం వరకూ హంద్రీ-నీవా జలాలు తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. తిరుపతి జిల్లాలో మల్లిమడుగుకు నీరు తెస్తామని, బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి దానికి నీటిని మళ్ళిస్తామన్నారు. సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ ద్వారా నీటిని బాలాజీ రిజర్వాయర్‌కు తరలిస్తామన్నారు. అక్కడి నుంచి కాలువలు తవ్వించి మధ్యలో వేణుగోపాల సాగర్ నిర్మిస్తామని, ఆ రిజర్వాయర్ నింపడంతో పాటు హంద్రీ-నీవా జలాలను పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టుకు చేరుస్తామన్నారు. అదే విధంగా మంగళంపేట నుంచి మూలపేట చెరువు మీదుగా కళ్యాణి డ్యామ్‌కు నీరివ్వడం ద్వారా శ్రీవారి పాదాల చెంతకు హంద్రీ నీవా నీరు తెస్తామన్నారు. ఈ సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి జిల్లా రుణం తీర్చుకుంటానని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

కపిలేశ్వర ఆలయాన్ని శుభ్రం చేస్తున్న చంద్రబాబు

కపిలేశ్వరాలయంలో 'స్వచ్ఛాంధ్ర'

పారిశుధ్య కార్మికులతో కలసి చెత్త ఊడ్చిన సీఎం

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతిలోని కపిలేశ్వరాలయంలో పారిశుధ్య కార్మికులతో కలసి సీఎం చంద్రబాబు చెత్త ఊడ్చారు. ఆలయాన్ని శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులతో సరదాగా ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తిరుపతికి నిత్యం లక్షమంది భక్తులు వస్తుంటారని, నగరం పరిశుభ్రంగా ఉంచాలంటే మీ చేతుల్లోనే ఉందన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కోసం అందరం కలిసి పనిచేయాలన్నారు. ఆలయ అర్చకుల యోగక్షేమాలపై ఆరాతీశారు. కపిలేశ్వరుడికి కైంకర్యాలు ఎంత పవిత్రంగా పనిచేస్తారో, ఆలయ పరిసరాలు కూడా అంతే పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం కపిలేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.





కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతితో చంద్రబాబు

సీఎం చంద్రబాబు ప్రజావేదిక ప్రాంగణంలోకి అడుగుపెట్టింది మొదలు వెనుదిరిగే వరకూ యువత, మహిళలు నినాదాలు, చప్పట్లు, ఈలలు, కేకలతో హోరెత్తించారు. సీఎం ప్రాంగణంలోకి వచ్చి స్టాల్స్ పరిశీలిస్తున్నంత సేపూ ఆ దృశ్యాలు వేదిక పక్కన ఎల్ఈడీ స్ర్కీన్‌పై ప్రదర్శించారు. వాటిని చూస్తూ జనం హర్షధ్వానాలు చేశారు. సీఎం వేదిక మీదకు వచ్చాక ఆయన ప్రసంగం కొనసాగినంత సేపూ ఈలలు, కేకలు, నినాదాలతో పాటు ప్లకార్డులు చూపుతూ

ఉరకలెత్తిన యువత

సందడి చేశారు. ప్రజలను ప్రశ్నించి సమాధానాలు రాబట్టేందుకు యత్నించినప్పుడల్లా రెట్టింపు ఉత్సాహంతో జనం స్పందించారు. ప్రజావేదికలో పాల్గొన్న వారిలో అత్యధికులు మహిళలు, విద్యార్థులే కావడంతో కార్యక్రమం కొనసాగినంత సేపూ వారి కేరింతలతో ప్రాంగణం మార్మోగింది. వారి స్పందన చూసి సీఎం సైతం అంతే ఉత్సాహంతో ప్రసంగాన్ని కొనసాగించారు.

ప్రజావేదికలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, ఏపీ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, మీడియా కో ఆర్డినేటర్ శ్రీధరవర్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

"వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి ప్రజలు ఏనాడైనా ప్రశాంతంగా నిద్రపోయారా? తిరుపతి నగరప్రజలకు తెలుగు గంగ నీరిచ్చింది ఎవరు? నగరానికి గరుడ వారధి తెచ్చింది ఎవరు? తిరుపతిలో పాతుకుపోయిన రౌడీలను నిర్మూలించి వారి గుండెల్లో నిద్రపోయిన పార్టీ తెలుగుదేశం"

తిరుపతి నగరం అధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా ఆర్థికంగానూ ఎదగాలి. భారతదేశానికి ఆదర్శం కావాలి.



పారిశుధ్య కార్మికులకు మెమెంటోలు అందిస్తున్న ముఖ్యమంత్రి




ప్రజావేదిక కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగం - పాల్గొన్న అతిథులు, తిరుపతివాసులు


పుష్కరిణిలో భక్తుల రద్దీ


అఖిలాండం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తిరుమల కిటకిట

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతునే ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లుతో పాటు నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటలు, స్లాటెడ్ సర్వదర్శనం, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం భక్తులు దాదాపు మూడు గంటల దర్శన సమయం పడుతోంది. అఖిలాండం, ఆస్థానమండపం, లడ్డూకేంద్రం, అన్నప్రసాద భవనం, ఆర్టీసీ బస్టాండ్, గదులు కేటాయించే కేంద్రాలు, ప్రధాన కూడళ్లలో యాత్రికులు కిక్కిరిసిపోయారు. కాలినడకన వచ్చే భక్తులు కూడా అధికంగానే ఉన్నారు.మరోవైపు స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేసే భూదేవి కాంప్లెక్స్, విష్ణునివాసం, శ్రీనివాసం కేంద్రాలు రద్దీగానే దర్శనమిస్తున్నాయి.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.21 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,093
తలనీలాలు సమర్పించినవారు: 31,570

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి నెలపాటు పుష్కరిణిలోకి నో ఎంట్రీ

తిరుమల, జూలై19(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా జూలై 20 నుంచి ఆగస్టు 19వ తేదీ వరకు తిరుమల శ్రీవారి పుష్కరిణిలోకి భక్తులను అనుమతించరు. ఈ నెలరోజులూ పుష్కరిణి హారతి కూడా ఉండదు. సెప్టెంబరు 24వ నుంచి బ్రహ్మోత్సవాలున్నందున మరమ్మతులు చేపడుతున్నారు.

ఐఐటీ స్నాతకోత్సవం నేడు


ఐఐటీ ప్రాంగణం

ఏర్పేడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఆదివారం ఏడవ కాన్వొకేషన్ జరగనుంది. దీనికి ముఖ్యఅతిథిగా కాగ్నిజెంట్ సహ వ్యవస్థాపకుడు, క్రియా యూనివర్శిటీ చాన్సలర్ లక్ష్మీనారాయణన్ హాజరుకానున్నారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్, ఎండీ సజ్జన్‌జిందాల్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ హోదాలో హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రతిభ కనబరచిన ఇంజనీరింగ్ విద్యార్థులకు అవార్డులను, డిగ్రీలను ప్రదానం చేయనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఈ ఉన్నత విద్యా సంస్థలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.

ఆడికృత్తికకు ఏర్పాట్లు పూర్తి


విజ్ఞానగిరి వద్ద విద్యుత్ దీపకాంతులు

శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణం విజ్ఞానగిరిపై శ్రీవల్లీ, దేవసేన సమేత చెంగల్వరాయస్వామి ఆడికృత్తిక ఉత్సవం ఆదివారం జరగనుంది. దీనికోసం ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వేకువజామున స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించాక భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఉదయం 9 గంటలకు ఉదయం ఇంద్ర విమాన సేవ, రాత్రి మయూర వాహన సేవ జరగనుందని ఈవో బాపిరెడ్డి తెలిపారు.

నేడు యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం యూపీఎస్సీ ఆధ్వర్యంలో కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం సంబంధిత అధికారులతో పరీక్షల ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. పరీక్షలు మూడు కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 1,052మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పేపర్-1 ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపుకార్డు తెచ్చుకోవాలన్నారు. సమావేశంలో యూపీఎస్సీ అబ్జర్వర్ కౌలేష్ గౌతమ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోతి దాడిలో చిన్నారికి గాయాలు

శ్రీకాళహస్తి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉడమలపాడులో కోతుల దాడులు పెచ్చుమీరుతున్నాయి. గడచిన పదిరోజుల వ్యవధిలో ఓ కోతి దాడిలో ఆరుగురు గాయాలపాలయ్యారు. తాజాగా శనివారం సురేంద్రబాబు నందిని దంపతుల ఏడాదిన్నర పాప విహితపై విరుచుకుపడింది. ఇంటి వద్ద ఆడుకుంటుండగా చిన్నారి చేతిని రక్కేసింది. గాయపడిన పాపను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుమారు 10కుట్లు పడినట్లు సమాచారం. గ్రామంలో కోతుల బెడదను తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.


ఆస్పత్రి వద్ద తల్లితో విహిత

భార్యను హతమార్చి.. ఆత్మహత్య

● దంపతుల విషాదాంతంతో అనాథలైన చిన్నారులు




హతురాలు ఉష - ఆత్మహత్య చేసుకున్న లోకేశ్వర్

తిరుపతి(నేరవిభాగం), జూలై 19(ఆంధ్రజ్యోతి): స్పర్థల నేపథ్యంలో భార్యను హతమార్చి తానూ ఆత్మహత్య చేసుకున్నాడో వ్యక్తి. తిరుపతి రూరల్ మండలం మంగళం రిక్షా కాలనీలో శనివారం జరిగిన ఈ ఘటనతో పిల్లలు అనాథలయ్యారు. సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ బొమ్మల క్వార్టర్స్‌కు చెందిన ఉష(34)కు గంగాధర నెల్లూరు మండలం ఠాణాకు చెందిన లోకేశ్వర్‌తో 15 ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి తొమ్మిదవ తరగతి చదువుతున్న కుమారుడు, ఏడవ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. ఉష కరకంబాడిలోని అమరరాజా ఫ్యాక్టరీలో పనిచేసేది. లోకేశ్వర్ కాంట్రాక్టు ప్రాతిపదికన టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. కొంతకాలంగా ఈ దంపతుల మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. గొడవలతో ఆమె పలుసార్లు పుట్టింటికి వెళ్ళిపోయేది. ఇటీవల గొడవలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఈక్రమంలోనే గత నెల 30న ఉష పుట్టింటికి వెళ్ళి పోయింది. లోకేశ్వర్ అక్కడే చిన్న గది అద్దెకు తీసుకుని ఉండేవాడు. ఈనేపథ్యంలో అతను భార్యను హతమార్చాలని పథకం పన్నాడు. శనివారం ఉదయం 5 గంటలకు డ్యూటీకి వెళ్లేందుకు కంపెనీ బస్సు కోసం వస్తున్న ఉషపై కత్తితో దాడి చేశాడు. గొంతుకోసి పరారయ్యాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తర్వాత లోకేశ్వర్ ఇంటికి వెళ్ళి తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు మృతి చెందడంతో పిల్లలిద్దరూ అనాథలుగా మిగలడం స్థానికులను కలచివేసింది. ఘటనా స్థలాన్ని అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి పరిశీలించారు. మృతదేహాలను రుయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



రెండు ఆటోల ఢీ

డ్రైవర్ మృతి ● ఐదుగురికి తీవ్ర గాయాలు



ఆటోలో ఆస్పత్రికి వెళుతున్న క్షతగాత్రులు

నాయుడుపేట టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అయ్యప్పరెడ్డిపాళెం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. శనివారం ఉదయం గూడూరు పట్టణానికి చెందిన మహిళలు ఆటోలో శ్రీకాళహస్తికి బయలుదేరారు. షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అశోక్ మృతి చెందాడు. మరో ఆటోలో ప్రయానిస్తున్న గౌతమి, ఉషారాణి, కామేశ్వరరావు, శశికుమారి, స్వప్నకు తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి సమస్యకు పరిష్కారం

పెళ్లకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు సమీపంలో ఉన్న అమ్మన్ ట్రై స్టీల్ పరిశ్రమకు భారీ వాహనాలు వెళ్లేందుకు పట్టా భూమిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దారిలో బీటీ రోడ్డు వేసే ప్రయత్నించడంతో రైతులు గోడ నిర్మించి రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో అమ్మన్ ట్రై పరిశ్రమకు చెందిన భారీ వాహనాలు నెలరోజులుగా గ్రామంలో నుంచి వెళ్తున్నాయి. భారీ వాహనాల రాకపోకల వల్ల దుమ్ము, దూళి సమస్యలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, టీడీపీ యువ నేత వేలూరు కల్యాణ్‌రెడ్డి చొరవ చూపారు. తనకు సంబంధించిన ప్రైవేట్ స్థలంలో ఉన్న రోడ్డులో నుంచి అమ్మన్ ట్రై స్టీల్ పరిశ్రమకు వెళ్లేందుకు వాహనాలను అనుమతించారు. గ్రామానికి దూరంగా ప్రైవేట్ స్థలంలో వాహనాలు వెళ్తుండడంతో దుమ్ము, దూళి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు కొంత ఊరట లభించింది.

ఆల్తూరుపాడు నిర్మాణానికి

నిధులు మంజూరు చేయండి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జులై 19 (ఆంధ్రజ్యోతి): ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. శనివారం తిరుపతి పర్యటనకు వచ్చిన చంద్రబాబును కురుగొండ్ల కలిసి వినతిపత్రం అందజేశారు. 2018లో టీడీపీ ప్రభుత్వం మొదలు పెట్టిన ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రిజర్వాయరు నిర్మాణం పూర్తయితే డక్కిలి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో 86 వేల ఎకరాలకు సాగునీరు, తిరుపతి, తిరుమలకు తాగునీరు అందించవచ్చన్నారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధనాయుడు ఉన్నారు.

ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు జుగుప్సాకరం

డక్కిలి, జులై 19 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు జన్ని రమణయ్య మండిపడ్డారు. డక్కిలిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి రాజీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉండేదని, మహిళలను ఎంతో గౌరవించేవారన్నారు. ఆయన కుమారుడైన ప్రసన్న కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు మహిళలు తలదించుకొనేలా ఉన్నాయని విమర్శించారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయడంలో ప్రసన్న కుమార్ రెడ్డి దిట్ట అని వ్యాఖ్యానించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి పట్టణ అధ్యక్షుడు డక్కిలి చంద్రారెడ్డి ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బాపూజీ కాలనీలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్, పక్కన ఏజీ కిషోర్, దంతాల రవి తదితరులు

సూళ్లూరుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ అన్నారు. శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ కాలనీలో ఇంటింటా పర్యటించి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. రాబోయే రోజుల్లో పేదరికం లేని సమాజం కోసం పీ4 సర్వే చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి ఏజీ కిషోర్, నాయకులు దంతాల రవి, కొమరంజేరి శ్రీధర్, కట్టా జనార్దన్, కొండలరావు, రమణయ్య, ఆలీభాయ్, వల్లూరు శ్యామ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నాయుడుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చెంగయ్య, కార్యదర్శి శివకవి ముకుంద డిమాండ్ చేశారు. నాయుడుపేట మున్సిపాలిటీ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు సంయుక్తంగా పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు శీనయ్య, నాగరాజు, కాలేషా, వీరాస్వామి, రవి, రామచంద్రయ్య, సురేష్, కృష్ణ, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

జీవ సాంకేతిక విజ్ఞాన గ్రంథం ఆవిష్కరణ

సూళ్లూరుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ విభాగాధిపతి డాక్టర్ విక్టోరియా రాణి రచించిన జీవ సాంకేతిక విజ్ఞాన గ్రంథాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజా, ఏడుకొండలు, శరత్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, రచయిత విక్టోరియా రాణి, అధ్యాపకులు

నేడు మల్లాంలో ఆడికృత్తిక వేడుకలు

చిట్టమూరు, జులై 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాంలో వెలసిన స్వయంభు వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చెర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, గణపతి హోమం, 6.30 గంటలకు స్వయంభు మూర్తికి పాలాభిషేకం, 8 గంటలకు అష్టోత్తర కలిశాభిషేకం, అమృతాభిషేకం, 10.30 గంటలకు శాంతి కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు విశేష అర్చనలు, రాత్రి 8గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు. అదేవిధంగా అరవపాళెం గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆడికత్తిక వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుందరాజా రెడ్డి తెలిపారు.

నేడు నాయుడుపేటకు మంత్రి సంధ్యారాణి రాక

నాయుడుపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఏఎంసీ గోదాము ప్రాంగణంలో జరగబోవు సుపరిపాలనలో తొలి అడుగు సమావేశంలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖామంత్రి సంధ్యారాణి పాల్గొననున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఏఎంసీ గోదాము ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నాటుబాంబు పేలి గేదెకు తీవ్ర గాయాలు

పెళ్లకూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన నాటు బాంబు పేలడంతో గేదె తీవ్రంగా గాయపడింది. మండలంలోని ఎగువ కానూరు గ్రామంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నిడిగంటి రమణయ్య గేదెలను మేపేందుకు పొలాల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ అడవి పందుల కోసం పాతిన నాటు బాంబు పేలడంతో గేదె ముఖం మొత్తం ఛిద్రమై తీవ్రంగా గాయపడింది.

వాటంబేడు ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశం

తడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వాటంబేడు ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశం శనివారం నిర్వహించారు. ఎంఈవో మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన అందించడం వంటి విషయాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునంద, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంపీలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.





గూడూరులో జరిగిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ - నాయుడుపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ, సచివాలయ, మెప్మా సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గూడూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్లాస్టిక్ కవర్లను నియంత్రించేందుకు మున్సిపల్ సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కాలుష్యం పెరిగి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. పర్యావరణానికి హాని కల్పించే ప్లాస్టిక్ కవర్లను ప్రతిఒక్కరూ నిషేధించి స్వచ్ఛాంధ్రకు సహకరించాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పచ్చదనం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, వెంకటేశ్వర్లు, మురళి, ప్రకాశ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: దుగరాజపట్నంలో మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మెరైన్ పోలీస్‌స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. దుగరాజపట్నం గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే మండలంలోని నెలిపూడి, వాకాడు సచివాలయ పరిసరాలను ఉద్యోగులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐలు అంజిరెడ్డి, సౌమ్య, మెరైన్ ఏఎస్ఐ నాగయ్య పాల్గొన్నారు.

నాయుడుపేట: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కలిగిస్తూ మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మన ఇంట్లో వలే పరిసరాలను, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు.

బాలాయపల్లి: స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పిస్తూ స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలాయపల్లి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బస్టాండు వద్ద మానవహారంగా నిల్చుని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రదీప్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం కిరణ్, పంచాయతీ కార్యదర్శులు మోహన్ రాజు, లీలావతి, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కోర్టులో స్వచ్ఛాంధ్ర దివస్ నిర్వహించారు. జడ్జి విష్ణువర్మ చీపుర చేతపట్టి కోర్టు ఆవరణలో చెత్తను తొలగించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ఇంట్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.





వెంకటగిరి కోర్టు ఆవరణలో చీపురుతో చెత్తను తొలగిస్తున్న జడ్జి విష్ణువర్మ - వాకాడు మండలం దుగరాజపట్నం మెరైన్ పోలీసు స్టేషన్ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్న మెరైన్ పోలీసులు

ప్రతిష్ఠాత్మకంగా సుపరిపాలనలో తొలి అడుగు

కోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం కోటలోని షాదీమందిర్‌లో మండల స్థాయి బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తనూ అందలం ఎక్కించాలన్నదే ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ లక్ష్యమన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉంటుందని, సుపరిపాలనలో కార్యక్రమం కూడా రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. అనంతరం వాకాడు ఏఎంసీ ఛైర్మన్‌గా ఎన్నికైన మర్రి ప్రమీల, చిట్టేడు, సిద్ధవరం, తిన్నెలపూడి సహకార సంఘాల ఛైర్మన్లుగా నియమితులైన చాపల శ్రీనివాసులు, పాదర్తి కోటేశ్వరరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డిలను టీడీపీ నాయకులు శాలువాలు, మెమోంటోలతో అభినందించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, టీడీపీ నాయకులు మధుయాదవ్, మోహన్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, సురేష్, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సహకార సంఘ ఛైర్మన్లను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పాఠశాలకు టైల్స్ వితరణ

గూడూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతి శిశుమందిరం పాఠశాలకు శనివారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో టైల్స్ అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులకు రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీనివాసులు, ధనుంజయరెడ్డి, సిద్దారెడ్డి దాతృత్వంలో రూ.25 వేల విలువ చేసే టైల్స్ అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, విజయ్‌భాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, మురళీరెడ్డి, నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, సనత్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో శనివారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో మురళీనాయుడు సహకారంతో టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధిని నయం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కుమార్, ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

26న ఔలియా దర్గాలో నిషాన్

గూడూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గావీధిలోని హజరత్‌సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో ఈనెల 26న నిషాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దర్గా ప్రతినిధులు తెలిపారు. శనివారం దర్గా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. 26వ తేదీ సాయంత్రం దర్గాలో నిర్వహించే నిషాన్ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రియాజ్ అహ్మద్, మగ్దూం, మస్తాన్‌ఖాదరీ, షాన్‌వాజ్, సందానీ, గౌస్, యస్థానీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను తరిమికొడదాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి

కోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను తరిమికొట్టాలని మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్ఐ శివసౌమ్య అన్నారు. శనివారం కోటలోని బీసీ బాలుర గురుకులంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. సీఐ వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ అవగాహన లోపంతో విద్యార్థులు డ్రగ్స్ భారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలను వివరించారు. అనంతరం డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడతామంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మెరైన్ ఏఎస్ఐ నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4 సర్వే పునఃపరిశీలన గ్రామసభలు

ఓజిలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగొండ, మాచవరం, మానమాల గ్రామాల్లో శనివారం పీ-4 సర్వే పునఃపరిశీలన గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్నరైతులు

పెళ్లకూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పగుంట కండ్రిగ సమీప స్వర్ణముఖినదిలో అక్రమ ఇసుక తవ్వకాలను రైతులు అడ్డుకున్నారు. మండలంలోని పుల్లూరు నుంచి తాళ్వాయిపాడు వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర స్వర్ణముఖినది ప్రవహిస్తోంది. ఇందులో రాత్రి పగలు తేడా లేకుండా నిత్యం ఇసుక అక్రమ రవాణా సాగుతున్న అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధునాతన బోధనపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మస్తానయ్య

కోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యా బోధనలో అధునాతన విధానంపై దృష్టి పెట్టాలని ఎంఈవో మస్తానయ్య అన్నారు. మండల పరిధిలోని గోవిందపల్లి, కోటలోని జడ్పీ, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు చిట్టేడు ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో ఎంఈవో సమీక్ష జరిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయి విద్యావిధానంపై దృష్టిపెట్టి బోధన సాగించాలన్నారు.

టీడీపీ మండల కార్యదర్శిగా కోటేశ్వరరావు



కోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోట పట్టణానికి చెందిన తిరుమల శెట్టి కోటేశ్వరరావు టీడీపీ మండల కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు కోటేశ్వరరావును మండల కార్యదర్శిగా నియమించామన్నారు. ఆయనను పలువురు నాయకులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఉపాధి పనుల పరిశీలన

కోట, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరు, పీకల్లదిబ్బ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ పరిశీలించారు. పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై కూలీల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీవో పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్ కాటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో దిలీప్‌కుమార్

పాఠశాలల్లో తరగతులు యథాతథం

కోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నార్త్‌గిరిజన కాలనీ, దైవాలదిబ్బ ప్రాథమిక పాఠశాలల్లో తరగతులను యథాతథంగా నిర్వహించాలని శనివారం విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు అందాయని ఎంఈవో మస్తానయ్య తెలిపారు. నార్త్‌గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను జరుగుమల్లి పాఠశాలలో, దైవాలదిబ్బ పాఠశాలలోని 3, 4, 5 తరగతులను అల్లంపాడు పాఠశాలలో విలీనం చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, నాయకులు ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అధికారలతో చర్చించి ఆయా పాఠశాలల్లోని తరగతులను కొనసాగించాలని కోరారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే పాశిం



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే పాశిం

గూడూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్వగ్రామమైన పులివర్తివారిపల్లెకు చేరుకుని ఆయన తల్లి లక్ష్మీభారతి భౌతికకాయానికి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. శనివారం తిరుపతి పర్యటకు వచ్చిన సీఎం చంద్రబాబును రేణిగుంట విమానాశ్రమంలో విజయశ్రీ కలిశారు. పులికాట్ గ్రాయిన్, సూళ్లూరుపేట, నాయుడుపేటలో కాళంగి, స్వర్ణముఖినదులపై వంతెనల నిర్మాణం, పెళ్లకూరులో మినీ రిజర్వాయర్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి


గూడూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ నాయకులు అన్నారు. శనివారం గోగినేని పురంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మదిర బాలయ్య, జశ్వంత్, శ్రీను, శివనరేష్, సందాని తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోండి

గూడూరు అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని మినర్వ పాఠశాల ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించామన్నారు. గెలుపొందిన విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందపల్లిపాళెంలో వాయలమ్మ ఉత్సవాలు

కోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలో గ్రామదేవత వాయలమ్మ ఉత్సవాల్లో భాగంగా శని వారం అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. మత్స్య కారులు పురాతన సంస్కృతి సంప్రదాయాలను నెమరువేసుకుంటూ గ్రామదేవత వాయలమ్మకు పాలాభిషేకం చేసి గ్రామోత్సవం నిర్వహించారు. గోవిందపల్లిపాళెంతో పాటు కొత్తపట్నం, శ్రీనివాస సత్రం, యమదిన్నె పాళెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు అమ్మవారిని దర్శించుకున్నారు.




టెంకాయ చిప్పలతో కళాకృతులు రూపొందించే స్టాల్ సందర్శిస్తున్న సీఎం


కంచి కామకోటి మఠంలో విద్యార్థులతో ఫొటో దిగిన చంద్రబాబు


కపిలేశ్వరస్వామి ఆలయ అర్చకుడితో మాట్లాడుతున్న సీఎం

భవితకు 'బంగారు' విజన్

- రెండు కుటుంబాల మొర ఆలకించిన సీఎం
- బిడ్డల చదువుకు ముందుకొచ్చిన మార్గదర్శులు

తిరుపతి(విద్య), జూలై 19 (ఆంధ్రజ్యోతి): బాగా చదివే బంగారం లాంటి పిల్లలు. కానీ చదివించే స్తోమతే లేదు. అలాంటి రెండు నిరుపేద కుటుంబాల ఆవేదనను సీఎం చంద్రబాబు విన్నారు. వారి చదువుకు సాయం అందించేందుకు రోటరీ క్లబ్, రాస్ సంస్థలు మార్గదర్శులుగా ముందుకొచ్చాయి. ఇలాంటి పిల్లలకు 'బంగారు' భవితను అందించే విజన్‌కు సంబంధించి బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో శనివారం తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ ప్రయత్నం ఇంతటితో ఆగదని, తానేకాదు... తెలుగు దేశం పార్టీ ఉన్నంత వరకు ఈ పి4 కార్యక్రమం సాగుతుందని స్పష్టం చేసారు.

సర్.. సాయం అందిస్తే డాక్టరవుతా



నాపేరు వినిత. మాది తిరుపతి నగరం గిరిపురం. బైపీసీ చదివాను. వెయ్యికి 986 మార్కులు సాధించా. నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని మెడిసిన్ చదవాలన్నది నా ఆశయం. మా నాన్న డి.హరిబాబు 2021లో కరోనాతోను.. అంతకుముందే అమ్మ నాగసులోచన అనారోగ్యంతో మృతి చెందారు. నాన్నమ్మ, తాతయ్య కష్టపడి ఎలాగోలా ఇప్పటివరకు నన్ను, చెల్లెలు అనిత, తమ్ముడు గణేష్‌ను చదివించారు. నేను డాక్టర్ అవ్వాలి. ఇంటర్ చదువుతున్న చెల్లెలు, టెన్త్ చదువుతున్న తమ్ముడికేమో సివిల్స్ సాధించి సమాజానికి సేవ చేయాలనే ఆకాంక్ష ఉంది. మీరు మాకు సాయంచేస్తే ఉన్నత స్థానానికి చేరి మాలాంటి వారికి సాయం అందిస్తాం.

- ఇదీ సీఎం చంద్రబాబుతో ఓ బంగారు బిడ్డ మాట

సమాజాన్ని భాగస్వామ్యం చేస్తే..

'ఇది బంగారు కుటుంబం. తల్లిదండ్రులు లేకపోయినా కష్టపడి బాగా చదువుతున్నారు. పైచదువులు చదివే స్తోమత వారికి లేదు. ఇలాంటి వారెందరో ఉన్నారు. నేను సాయంచేస్తే ఒకరో ఇద్దరికో చేయగలను. కానీ, సామాజిక బాధ్యత కలిగిన వారిని భాగస్వాములను చేస్తే.. మరెందరికో సాయం అందించి మార్గదర్శులుగా నిలుస్తారు. వారి అండతో ఉన్నత శిఖరాలకు చేరినవారు మరో పదిమందికి సాయం అందించి సమాజాన్ని తీర్చిదిద్దుతారు. అందుకే 'బంగారు కుటుంబం.. మార్గదర్శి' కార్యక్రమం నా మదిలో మెదిలింది. ఆ ఆలోచనకు అనుగుణంగా వినిత బంగారు కుటుంబానికి చేయూతనిచ్చేందుకు ఓ మార్గదర్శి ముందుకు వచ్చారు' అంటూ వినితను, ఆమె చెల్లెలు, తమ్ముడిని వేదికపై నుంచి సీఎం చంద్రబాబు చూపుతూ మాట్లాడారు.

మంచి వేదికను ఇచ్చారు

వినిత కుటుంబానికి సాయం అందించే మార్గదర్శిగా తిరుపతి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కె.రాజేంద్రశెట్టి ముందుకొచ్చారు. 'సాయం చేయాలని చాలామందికి ఉంటుంది. దానికి ఓ వేదికంటూ లేకపోవడంతో ఎవరికి సాయం చేయాలన్నది అర్థంకాని విషయంగా ఉంటుంది. ముఖ్యమంత్రి విజన్‌లో భాగంగా రూపొందిన ఈ కార్యక్రమం అందుకు చాలా ఉపకరిస్తుంది. సాయం కావాల్సిన వారు.. అందించేవారు ముందుకొస్తారు. దీనిద్వారా భవిష్యత్తులో అణగారిన వర్గాలు అభివృద్ధిలోకి వస్తాయి. వినిత, ఆమె చెల్లెలు, తమ్ముడి చదువు బాధ్యతను తిరుపతి రోటరీ క్లబ్ భరిస్తుంది' అని చెప్పారు.

సర్, నా బిడ్డలను చదివిస్తే చాలు



నాపేరు కె.ఈశ్వరి. తిరుపతి నగరం సింగాలగుంట. అనారోగ్యంతో నా భర్త మృతిచెందారు. నా కుమారులు రాహుల్ 8వ, చైతన్య 5వ తరగతి చదువుతున్నారు. వాళ్లు బాగా చదువుతున్నా.. చదివించే స్తోమత నాకు లేదు. నా బిడ్డల చదువుకు సాయం చేయండి.

- ఇదీ ఓ బంగారు తల్లి అభ్యర్థన

ముందుకొచ్చిన 'రాస్'

ఏమ్మా తల్లికి వందనం ఇద్దరు బిడ్డలకూ వచ్చిందా అని సీఎం చంద్రబాబు కుమారిని అడగ్గా వచ్చిందని చెప్పారామె. గతంలో ఒకరికే ఇచ్చేవారని, ఇప్పుడు పిల్లలందరికీ ఇస్తున్నామని చెప్పారు. ఈశ్వరి కుటుంబానికి సాయం అందించేందుకు 'రాస్' ముందుకు వచ్చిందంటూ ఆ సంస్థ ప్రతినిధిని పరిచయం చేశారు. 'ఈ ఇద్దరి పిల్లలకు 'రాస్' మంచి విద్యను అందించి ప్రయోజకులను చేస్తుంది. బ్యూటీషియన్ కోర్సుపై ఈశ్వరి ఆసక్తి చూపుతున్నందున, ఆమెకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తాం. సీఎం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ఇలా సాయపడే అవకాశం రాస్‌కు కలిగినందుకు సంతోషంగా ఉంది' అని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు.

సింగపూర్ తరహాలో వ్యర్థ నీటి వినియోగం

అధికారులు, ప్రజాప్రతినిధులకు సీఎం చంద్రబాబు ఆదేశం ● తూకివాకం ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రం పరిశీలన

తిరుపతి(కలెక్టరేట్), జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి నగరం సహా 50 కిలోమీటర్ల పరిధిలో సేకరించిన వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీప్లాంట్ సద్వినియోగం చేసుకునేలా చూడండి. వ్యర్థ నీటిని వృథా కానివ్వకుండా సింగపూర్ తరహాలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోండి' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రేణిగుంట మండలం తూకివాకం వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. బయోమిథనైజేషన్ గ్యాస్‌ప్లాంట్, భవన నిర్వహణ వ్యర్థాల యూనిట్లను సందర్శించారు. రీసైక్లింగ్ కోసం వచ్చిన ఘనవ్యర్థాలను వినియోగించుకున్నాక వేస్ట్‌ను ఎనర్జీప్లాంట్‌కు తరలించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను, కూరగాయాల మార్కెట్ నుంచి వచ్చిన తడి, పొడి చెత్తను, ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్‌ను సీఎం పరిశీలించారు. వినియోగించిన నీటిని ఎలా సద్వినియోగం చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. విశాఖతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు సూచించారు. తిరుపతిలోని హోటళ్ల నుంచి సేకరిస్తున్న 50 టన్నుల వ్యర్థాలను రోజూ శుద్ధి చేస్తున్నట్లు కమిషనర్ మౌర్య సీఎంకు వివరించారు. ఇళ్లు, మార్కెట్‌నుంచి సేకరించిన కూరగాయల వ్యర్థాలతో ఎంతమేర ఎరువులను తయారు చేస్తున్నారని సీఎం అడిగారు.

290 ఎకరాల్లో ఇంత మంచి ప్లాంటా!

తూకివాకంలో 290 ఎకరాల్లో ఇంత మంచి ప్లాంటు ఉందా అని సీఎం చంద్రబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2018లో మీ హయాంలోనే స్మార్ట్ సిటీ నిధుల కింద ఈ ప్లాంటు రూపుదాల్చిందని అధికారులు సీఎంకు గుర్తుచేశారు. ఈ ప్లాంటును పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. బ్యాటరీ వాహనంలో సీఎం చంద్రబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు తూకివాకంలోని ప్లాంట్‌లో 20 నిమిషాలపాటు కలియదిరిగారు. సీఎం వెంట మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, జేసీ శుభం బన్సల్, ప్రిన్సిపల్ సెక్రటరీలు అనిల్‌కుమార్, సురేష్, ట్రాన్స్‌కో టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


తూకివాకం వద్ద ప్లాంటు పరిశీలిస్తున్న సీఎం

సాంకేతిక సమస్యతో ఎయిర్ ఇండియా విమానం రద్దు

రేణిగుంట, జూలై19 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యతో ఎయిర్ ఇండియా విమానం రద్దయింది. శనివారం ఉదయం 7.15 గంటలకు హైదరాబాదు నుంచి తిరుపతికి రావాల్సిన ఈ విమానం శంషాబాద్ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రద్దు చేశారు. దీంతో తిరుపతి నుంచి హైదరాబాదుకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు డబ్బు రీఫండ్ చేస్తామని, అత్యవసరమైతే మధ్యాహ్నం ఫ్లైట్‌కు లేదంటే రేపు ఉదయం పంపుతామని ఎయిర్ ఇండియా యాజమాన్యం ప్రయాణికులకు తెలిపింది.

బుద్ధుడితో నా ప్రయాణం

ఆలోచింపజేసిన నాటక ప్రదర్శన





తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో శనివారం సాయంత్రం ప్రదర్శించిన 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం సందేశాత్మకంగా ఉంది. బౌద్ధం నేపథ్యంగా సాగిన ఈ నాటకాన్ని చల్లప్ప మేస్త్రీ స్మారక అంబేడ్కర్ భవన్, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, బుద్ధిస్ట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించాయి. నాటకాన్ని వీక్షించిన ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ.. బౌద్ధం మంచి జీవన విధానాన్నీ, స్వేచ్ఛ, సమత, కరుణ, దయను మనిషికి అలవరుస్తుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. సత్యం, ధర్మం, అహింస వంటి విలువలను మనిషికి అందించిన మహోన్నతుడు బుద్ధుడని కొనియాడారు. మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ.. బౌద్ధం సామాజిక చైతన్యాన్ని కలిగించిందన్నారు. రిటైర్డు జడ్జి గుర్రప్ప, అంబేడ్కర్ భవన్ అధ్యక్షుడు డాక్టర్ పరమశివన్‌లు మాట్లాడారు. నాటకాన్ని వీక్షించిన వారిలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చందన స్రవంతి, కృష్ణ, పలువురు దళిత, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.


తల్లి లక్ష్మీభారతి అంత్యక్రియలను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ముగిసిన నానీ తల్లి అంత్యక్రియలు

పాకాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ తల్లి లక్ష్మీభారతి అంత్యక్రియలు శనివారం పాకాల మండలం పులివర్తి వారిపల్లెలో శనివారం నిర్వహించారు. చిత్తూరులోని స్వగృహంలో శుక్రవారం ఉదయం లక్ష్మీభారతి కన్నుమూయగా, ఆమె పార్థివదేహాన్ని వీరి స్వగ్రామం పులివర్తివారిపల్లెకు తీసుకొచ్చారు. శనివారం మధ్యాహ్నం వ్యవసాయక్షేత్రంలో నిర్వహించిన అంతిమ సంస్కార కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, టీడీపీ నాయకులు, బంధువులు, స్థానికులు పాల్గొని నివాళులు అర్పించారు.

క్యూలైన్‌లో కుప్పకూలిన భక్తుడు

- చికిత్స పొందుతూ మృతి

తిరుమల, జూలై19(ఆంధ్రజ్యోతి): మూడురోజుల క్రితం తిరుమలలో అస్వస్థతకు గురైన ఓ భక్తుడు తిరుపతిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటకాలోని మాలూరుకు చెందిన వేణుగోపాల్(45) ఈనెల 17న సర్వదర్శన క్యూలైన్‌లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తొలుత అశ్విని ఆస్పత్రికి తర్వాత స్విమ్స్‌కి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుని వద్ద లభించిన సెల్‌ఫోన్, గుర్తింపు కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు వైసీపీ నాయకులు పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులయ్యారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో.. పెళ్ళకూరుకు చెందిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సత్యవేడుకు చెందిన డి.బీరేంద్ర వర్మ, ఓడూరు గిరిధర్‌రెడ్డి, కోడూరు కల్పలతారెడ్డి, చిత్తూరు పార్లమెంటులో.. పుంగనూరుకు చెందిన ఎస్.అనీషారెడ్డి, ఎస్.వెంకటరెడ్డి యాదవ్, పెనుమూరుకు చెందిన మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి, బైరెడ్డిపల్లికి చెందిన మొగసాల కృష్ణమూర్తి నియమితులయ్యారు. వీరు రాష్ట్ర కార్యదర్శులైనా సంబంధిత పార్లమెంటు నియోజకవర్గాలకే వీరి కార్యకలాపాలు పరిమితమై వుంటాయి. పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుని అసెంబ్లీ సెగ్మెంట్లలో రీజనల్ కో ఆర్డినేటర్లకు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులకు సహాయకులుగా వ్యవహరిస్తారని వైసీపీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది.

నంది సర్కిల్లో సందడి

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరాలయం వద్ద నంది సర్కిల్‌కు మధ్యాహ్నం 1.20 గంటలకు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆయనకు స్వాగతం పలికారు. కాన్వాయ్ నిలిపి కార్యకర్తలకు సీఎం అభివాదం చేశారు. తెలుగు మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. జైబాబు నినాదాలతో హోరెత్తించారు. అక్కడే ఉన్న ప్రత్యేక బస్సులోకి చంద్రబాబు వెళ్లారు. స్థానిక నాయకులు సుగుణమ్మ, నరసింహ యాదవ్, డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులను బస్సులోకి పిలిపించుకున్నారు. కలసి భోజనం చేశారు. అనంతరం కపిలేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. దాదాపు రెండు గంటల పాటు కపిలతీర్థం వద్ద సీఎం గడపడంతో కార్యకర్తలతో సందడి వాతావరణం నెలకొంది.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 19(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన పలువురు పారిశుధ్య కార్మికులను ప్రజావేదికపై సీఎం చంద్రబాబు సన్మానించారు. సత్కారం పొందిన వారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్ ఎన్. ఏకాంబరం, పీహెచ్ వర్కర్ శ్రీనివాసులు, వార్డు శానిటేషన్ వర్కర్ గణేష్‌బాబు, ఇతర కార్మికులు అజయ్ సాధినేని, రాఘవ, వి. చంచయ్య, కె.సుమతి ఉన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు తిరుపతికి రావడం గర్వకారణమని, అందుకు కారణం పారిశుధ్య కార్మికులేనని సీఎం కొనియాడారు.

ఎయిర్‌పోర్టు వద్ద కాలువలో పడి గాయాలు

- చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు


గాయపడిన వెంకటేశ్వరరావు

వడమాలపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సీఎం పర్యటన నేపథ్యంలో శనివారం రేణిగుంట విమానాశ్రయం వద్ద టీడీపీ నాయకుడొకరు గాయపడ్డారు. పాపరాజుకండ్రిగకు చెందిన గొర్ల వెంకటేశ్వరరావు చంద్రబాబును చూడాలనే ఉత్సాహంతో ఎయిర్‌పోర్ట్ వద్ద మురుగు నీటి కాలువ పైన నడుస్తూ పడిపోయారు. సిమెంట్ దిమ్మె కూలిపోయి నీటి కాలువలో పడిపోయారు. దిమ్మె ఇనుప కమ్మీలు గుచ్చుకొని కుడి పాదం తెగి తీవ్ర రక్తస్రావమైంది. అధికారులు గుర్తించి వెంటనే ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే గాలి. భానుప్రకాష్‌పరామర్శించారు. పార్టీ పరంగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా బాధితుడి ఆరోగ్యం గురించి ఆరా తీశారు.

రేణిగుంట,(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు వద్ద పలువురు సీఎంకు తమ గోడు వివరించారు. వారి నుంచి ఆయన వినతిపత్రాలను స్వీకరించారు. పింఛను తొలగించారని, వైద్య సహాయం చేయాలని, ఇలా రకరకాల అభ్యర్థనలను చంద్రబాబు సామధానంగా విన్నారు. సానుకూలంగా స్పందించారు.

- ఎయిర్‌పోర్టు వీఐపీ గ్యాలరీకి తమరె అనుమతించలేదని అడిషనల్ ఎస్పీపై కొందరు టీడీపీ సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- రేణిగుంట ఎన్టీఆర్ కూడలిలో చంద్రబాబుకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.

చంద్రబాబుకు నీరాజనం

- ప్రశాంతంగా ముగిసిన పర్యటన



తిరుపతి(నేరవిభాగం), జూలై 19(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు శనివారం తిరుపతిలో జన నీరాజనం పలికారు. పలుచోట్ల రోడ్లకు ఇరువైపులా నిలబడి పూలు చల్లుతూ స్వాగతించారు. నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకోగా సీఎం వాహనంపై పూల వర్షం కురిపించారు. మహిళలు సెల్ఫీలు తీసుకున్నారు. ఇక, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రజావేదిక సభ వద్దకు రాగానే విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున చంద్రబాబు జిందాబాద్ అంటూ ఈలలు, కేకలు వేస్తూ నినాదాలు చేశారు. ఒక దశలో వారిని కంట్రోలు చేయడానికి పోలీసులకు సాధ్యపడలేదు. తిరుపతిలో ఏడు గంటల పాటు సాగిన సీఎం పర్యటన జిల్లా పోలీసు యంత్రాంగం తీసుకున్న ముందస్తు చర్యలతో ప్రశాంతంగా ముగిసింది. ప్రతి చోటా అదనపు ఎస్పీల స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించడంతో పాటు ఎప్పటి కప్పుడు సంబంధిత అధికారులు, పోలీసులను ఎస్పీ హర్షవర్ధన రాజు వైర్‌లెస్ సెట్ ద్వారా పర్యవేక్షించారు.

పోలీసు అధికారులపై రాష్ట్రప్రభుత్వ వేధింపులు

- రాష్ట్రపతి, ప్రధాని, సీజేఐకి వైసీపీ ఎంపీ గురుమూర్తి లేఖలు

న్యూఢిల్లీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్‌లు, రాష్ట్రస్థాయి పోలీసు అధికారులకు పోస్టింగ్‌లు, జీతాలు ఇవ్వకుండా ఏపీ ప్రభుత్వం వేధిస్తోందని వైసీపీ ఎంపీ గురుమూర్తి ఆరోపించారు. ఈ అంశంలో వెంటనే జోక్యం చేసుకుని కూటమి ప్రభుత్వ పాలనలో ఇబ్బందులు పడుతున్న అధికారులకు పోస్టింగ్‌లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం, రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌కి లేఖలు రాశారు. గతేడాది జూన్ నుంచి నలుగురు ఐపీఎస్‌లు సహా 199 మంది అధికారులను కూటమి ప్రభుత్వం వెయిటింగ్‌లో ఉంచిందని అన్నారు. ఏపీ ప్రభుత్వం రాజ్యాంగా విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పోస్టింగ్‌లు, జీతాలు ఇవ్వకుండా అధికారులపై తీవ్ర వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఓవైపు అధికారుల కొరత ఉందని చెబుతున్న ఏపీ ప్రభుత్వం.. చాలా మంది అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వడం లేదని అన్నారు. తక్షణమే జోక్యం చేసుకుని అధికారులకు జీతభత్యాలు, పెన్షన్లు చెల్లించాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు.

కత్తితో దాడి: యువకుడికి గాయాలు


గాయపడిన వేణుగోపాల్

తిరుపతి(నేరవిభాగం), జూలై 19(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వివాద నేపథ్యంలో జరిగిన దాడిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ రామయ్య కథనం మేరకు.. నేపాల్‌కు చెందిన సుమన్, సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన ఎం. వేణుగోపాల్ లు వేర్వేరు హోటళ్లలో వంట మాస్టార్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ ఒకే రూములో ఉంటున్నారు. తరచూ గొడవపడేవారు. ఈక్రమంలో శుక్రవారం అర్ధరాత్రి రూంలో పరస్పరం కొట్టుకున్నారు. సుమన్ ఆగ్రహంతో కూరగాయల కత్తితో వేణుగోపాల్‌పై దాడి చేశాడు. గొంతు, చాతిపై పొడిచాడు. తీవ్రంగా గాయపడిన వేణుగోపాల్‌ను స్థానికులు వెంటనే రుయాస్పత్రికి తరలించారు. సీఐ రామయ్య, ఎస్ఐలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు సుమన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.